# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 133 VEKUVA SAMAYAM TELUGU DAILY

★ Mahabubnagar ★ Hyderabad ★ Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: గురువారం 04 జూన్ 2026





**అపోహలు తొలగించి సాధికారత వైపు**



## కన్నడ పీఠంపై డీకే

2వ పేజీలో...



## ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌లపై సంచలన తీర్పు

2వ పేజీలో...



## తెలంగాణ టీచర్లకు అలర్ట్

**తెలంగాణ రాష్ట్రంలో సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు రేవంత్ సర్కార్ తీపి కబురు అందించింది. రాష్ట్రంలోని ఇన్-సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.**

**హైదరాబాద్, సమయం ప్రతినిధి :** సాధారణంగా ప్రతి ఏటా నిర్వహించే రెండు టెట్ పరీక్షలకు అదనంగా.. మరో రెండు ప్రత్యేక టెట్ పరీక్షలను నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. పూర్తిగా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసమే ఈ ప్రత్యేక టెట్ పరీక్షలను ప్రభుత్వం తలపెట్టింది. గత కొంతకాలంగా ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం.. ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రత్యేక టెట్ నిర్వహణకు సంబంధించి అధికారిక ఉత్తర్వులను కూడా జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో.. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి తదుపరి అవసరమైన అన్ని చర్యలనూ తక్షణమే చేపట్టాలని విద్యాశాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.



## ఆర్టీసీ బస్సు బీభత్సం..

**హైదరాబాద్, సమయం ప్రతినిధి :** సికింద్రాబాద్ జూబ్లీహిల్స్ బస్టాప్ సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. జేబీఎస్ నుంచి కార్ఖానా వైపు వెళ్తున్న బస్సు అదుపు తప్పి ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో రోడ్డుపై వెళ్తున్న శివ అనే ద్విచక్ర వాహనదారుడిని బలంగా ఢీకొట్టింది. దీంతో యువకుడు తన బైక్‌తో సహా బస్సు ముందు చక్రాల కింద ఇరుక్కుపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి యువకుడిని కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నించారు. కానీ బస్సును జరపడం సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న మారేడుపల్లి ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే క్రేన్‌ను రప్పించి, బస్సును పక్కకు జరిపి, యువకుడిని బయటికి తీశారు. అనంతరం అతన్ని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు రోజుల పాటు పాలమూరులో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన



**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 4, 5 తేదీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల పనులను పరిశీలించడంతో పాటు అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. జూన్ 4న నారాయణపేట జిల్లా మక్తల్‌లో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించనున్న ముఖ్యమంత్రి, అనంతరం కోయిల్‌సాగర్, జూరాల ప్రాజెక్టులు, కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదిత బ్యారేజీలను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించనున్నారు. సాయంత్రం గూడెందొడ్డి రిజర్వాయర్, జేఎన్ఎల్ఐఎస్ స్టేజ్-1 పంప్‌హౌస్‌ను సందర్శించిన అనంతరం సోమశిలలో బస చేయనున్నారు. అదే రోజు రాత్రి సోమశిలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. జూన్ 5న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ఎల్లూరు పంప్‌హౌస్, నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉద్దండాపూర్ రిజర్వాయర్ల పనులను పరిశీలించనున్నారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. సాయంత్రం ఉద్దండాపూర్‌లో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు.







# సంపాదకీయం

## రాజకీయం సరే, ఆర్థికం మాటేమిటి?

'ఆడుతూ ఉన్నప్పుడే మీరు గెలుస్తారు. మీరు ఆడకపోతే గెలుపెలా వస్తుంది?' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల చిన్నపిల్లలతో మాట్లాడుతూ అన్నారు. 1987లో భారతీయ జనతా పార్టీలో చేరినప్పటి నుంచీ నరేంద్రమోదీ రాజకీయాల్లో ఆడుతూనే ఉన్నారు. వచ్చే ఏడాది ఈ రాజకీయ క్రీడలో నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకోనున్న మోదీకి ఇప్పటి వరకూ చెప్పుకోదగ్గ ఓటమి వాటిల్లలేదు. 1987లో బీజేపీ గుజరాత్ ప్రధాన కార్యదర్శిగా ఆయనకు అహ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ బాధ్యతలు అప్పజెప్పినప్పుడు తొలిసారి తన పార్టీకి ఆ నగర పాలనా సంస్థను కైవసం చేయడంలో సఫలమయ్యారు. అప్పటి నుంచీ ఆయన వెనక్కు తిరిగి చూడనే లేదు. కార్పొరేషన్ గెలుపుతో గుజరాత్‌లో ప్రారంభమయిన ఆయన విజయ ప్రస్థానం రాష్ట్రంలో బీజేపీని అధికారంలో తెచ్చి, తర్వాత స్వయంగా తానే ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి, 12 సంవత్సరాలు తిరుగులేని పాలన చేపట్టేంతవరకూ సాగింది. అంతటితో ఆగకుండా మోదీ 2014లో ఏకంగా దేశ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. కేంద్రంలోనూ నిరాఘాటంగా గత 12 సంవత్సరాలుగా ఆ అత్యున్నత పదవిలో కొనసాగుతున్నారు. 1987లో మోదీ ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించేనాటికి కాంగ్రెస్ కేంద్రంలోనూ, 15 రాష్ట్రాల్లోనూ అధికారంలో ఉండేది. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో గెలుపుతో మోదీ సారథ్యంలో బీజేపీ, దాని మిత్రపక్షాలు 21 రాష్ట్రాల్లో అధికారం సాధించినట్లయింది. ఒక రకంగా మోదీ ఇప్పుడు రాజకీయ జీవితపు మహోన్నత దశలో ఉన్నారు. ఒకవైపు 12 సంవత్సరాల తన పాలన విజయోత్సవాలకు సన్నాహాలు చేస్తూనే మరోవైపు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ భారీ మార్పులకు ఆయన సిద్ధమవుతున్నారు. తన తదుపరి రాజకీయ క్రీడకు ఆయన రంగం సిద్ధం చేస్తున్నారు. 'గెలుపు క్రీడ మాత్రమే కాదు, అది పులిపై స్వారీ చేయడం లాంటిది' కూడా అని రాజనీతిజ్ఞులు అభివర్ణిస్తుంటారు. ఒక్కసారి దానిపై నుంచి దిగితే అదే మనను స్వాహా చేస్తుంది. 'ప్రజాస్వామ్యం అంటే ఎన్నికల్లో విజయం సాధించడం మాత్రమే కాదు' అని అంబేద్కర్ ఎప్పుడో చెప్పారు. రాజకీయాల్లో మోదీ ప్రభుత్వానికి తిరుగు లేకపోయినా, భారత ఆర్థిక పరిస్థితి మాత్రం ఆందోళనకరంగా ఉన్నది. జీడీపీ పెరుగుదల క్రమంగా తగ్గుతోందని, సగటు ద్రవ్యోల్బణం రెట్టింపు అవుతోందని, అభివృద్ధి వేగం మందకొడిగా సాగుతోందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. మే నెలలో ఆర్థిక మంత్రిత్వశాఖ రూపొందించిన నెలవారీ సమీక్ష అంతర్జాతీయ పరిణామాలు భారతదేశ ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని స్పష్టం చేసింది. రూపాయి విలువ రోజురోజుకూ పడిపోతోంది. క్రూడాయిల్ దిగుమతి బిల్లులు పెరుగుతున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత మే 15 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగుసార్లు పెరిగాయి. వరుసగా రెండో వారం భారత విదేశీమారక ద్రవ్య నిల్వలు పడిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు కూడా తగ్గిపోతున్నాయని మాజీ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం వంటి ఆర్థికవేత్తలు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు. జపాన్‌ను అధిగమించి నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించిందని మే 2025లో నీతీ ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం ప్రకటించారు. కానీ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ తాజాగా విడుదల చేసిన వరల్డ్ ఎకనమిక్ అవుట్ లుక్ ప్రకారం భారతదేశం ఆరవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు పడిపోయింది. ఈ విషయం ఎలా ఉన్నప్పటికీ గణాంక వివరాలతో సంబంధం లేకుండా దేశంలో తలసరి ఆదాయం అతి తక్కువస్థాయిలో ఉన్నదని అందరికీ తెలుసు. 1991 నుంచి చైనాలో తలసరి ఆదాయం 38సార్లు పెరిగితే.. మన దేశంలో కేవలం 8సార్లే పెరిగిందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ప్రధాని మోదీ స్వయంగా పొదుపు చర్యలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేయడమే పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు స్వల్పకాలిక చర్యలు తీసుకుంటోంది కానీ, దీర్ఘకాలిక చర్యలు చేపట్టడం లేదని ఆర్థికవేత్తలు అంటున్నారు. దీర్ఘకాలిక చర్యలు అంటే ఏమిటి? సంస్కరణలను మరింత వేగవంతం చేయడమా? విదేశీ పెట్టుబడులు మరింత స్వేచ్ఛగా ప్రవేశించేందుకు వీలు కల్పించడమా అన్న చర్చలు జరుగుతున్నాయి. మోదీ ఈ దిశగా ఏ చర్యలు తీసుకుంటున్నారో ఎవరికీ స్పష్టత లేదు. దేశ ఆర్థిక పరిస్థితిపై నీతీ ఆయోగ్ వంటి సంస్థలు కూడా పారదర్శకంగా నివేదికలు ప్రకటించడం లేదు. ఇలాంటి సంస్థలు అభివృద్ధిని గోరంతలు కొండంతలు చేసేందుకే తహతహలాడుతుంటాయి. ప్రభుత్వానికి వాస్తవ పరిస్థితిని చెప్పేందుకు అవి ప్రయత్నించడం మానేసి చాలా కాలమైంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా మంత్రుల తలలు మారిస్తే మాత్రం పరిస్థితి మెరుగవుతుందా? రెండవది, ఎన్నికల్లో విజయం సాధించలేకపోతోన్న ప్రతిపక్షాలు.. వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయన్న అభిప్రాయాన్ని ప్రజల్లో కల్పించడంలో విజయవంతమయినట్లే కనిపిస్తున్నాయి. ఎన్నికల కమిషన్, సీబీఐ, ఈడీ, ఐటీ, సీవీసీ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వంటి సంస్థల పనితీరుపై మాత్రమే కాదు, సుప్రీంకోర్టు ఇస్తున్న తీర్పులపై కూడా అనుమానం కలిగించేందుకు ఆస్కారం కలిగిస్తున్నాయి. విచిత్రమేమంటే ఎన్నికలు సవ్యంగా జరిగినా ఎన్నికల కమిషన్ విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతోంది. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ఎడాపెడా ప్రయోగించడం వల్ల అవి నిజంగా పనిచేసినా వాటిపై నమ్మకం కలగడం లేదు. సుప్రీంకోర్టుకూ, ప్రభుత్వానికీ మధ్య ఉండాల్సిన హద్దులు చెరిగిపోతున్నాయా అన్న అనుమానం కలిగే విధంగా న్యాయమూర్తులు వ్యవహరిస్తున్నారు. చివరకు విద్యార్థులకు పరీక్షలు కూడా సరిగా నిర్వహించలేని దుస్థితి ఈ దేశంలో నెలకొన్నదని నీట్ ప్రశ్నపత్రాలు మరోసారి లీక్ కావడంతో తేలింది. ఈ పరిస్థితులపై కాక్రోచ్ జనతా పార్టీ పేరిట సోషల్ మీడియాలో ఇచ్చిన పిలుపునకు ఈ దేశ యువత కనీవినీ ఎరుగని రీతిలో ప్రతిస్పందించిన తీరు ఎక్కడో నిప్పు రగులుతోందన్న భావనను కలిగిస్తోంది. సోషల్ మీడియా అకౌంట్లను నిలిపివేసినంత మాత్రాన ప్రశ్నలు వేసేవారు తగ్గిపోతారనుకోవడం అమాయకత్వం.




హైదరాబాద్: తెలంగాణను పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్యస్థానంగా అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈరోజు(బుధవారం) సీఎం రేవంత్‌రెడ్డిని.. దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాలస్ మషటైల్ బృందం ఎంసీహెచ్‌ఆర్డీలో కలిశారు. అధికారిక పర్యటనలో భాగంగా దక్షిణాఫ్రికా బృందం హైదరాబాద్ వచ్చింది. ఈ సమావేశంలో పెట్టుబడులపై సీఎంతో.. పాలస్ మషటైల్ బృందం చర్చించింది. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తరఫున మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి దామోదర రాజనరసింహ, సీఎస్ రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, పారిశ్రామిక, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా సమాచార సాంకేతికత, తయారీ, మౌలిక సదుపాయాలు, ఫార్మా, వ్యవసాయం తదితర రంగాల్లో పరస్పర సహకార అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, పారదర్శక పాలన, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ తెలంగాణ ప్రత్యేకతలని వివరించారు.
దక్షిణాఫ్రికా కంపెనీలు తెలంగాణలో పరిశ్రమలు స్థాపించడం ద్వారా ఇరు ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు. దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాలస్ మషటైల్ కూడా తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక రంగ పురోగతిపై ఆసక్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో మరింత సహకారం కొనసాగించేందుకు ఇరు పక్షాలు సానుకూలంగా స్పందించాయి.

## కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం

మొదటి పేజీ తరువాయి

కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.
కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**మంత్రులుగా..**

కాగా, డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు.

## ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నైపుణ్యంతో కూడిన ఆటలైనా సరే.. డబ్బులు పెట్టి బెట్టింగ్ కాస్తే రాజ్యాంగ రక్షణ ఉండదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు చేసిన చట్టాలు పూర్తిగా చెల్లుతాయని స్పష్టం చేసింది. ఆన్‌లైన్ జూదాలను నిషేధించే పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని వెల్లడించింది. బెట్టింగ్ వ్యాపారం ఎవరికీ 'మౌలిక హక్కు' కాదని ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులకు, గేమింగ్ కంపెనీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వాల నిషేధ చట్టాలను కొట్టివేస్తూ మద్రాస్, కర్ణాటక హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు సమర్థించింది. రాజ్యాంగం ప్రకారం బెట్టింగ్, జూదం అంశాలపై చట్టాలు చేసే సర్వాధికారాలు రాష్ట్రాలకే ఉన్నాయని స్పష్టం చేసింది. ఆట ఆడటానికి నైపుణ్యం అవసరమైనప్పటికీ, దానిపై డబ్బుల పందేలు కాస్తే అది జూదం కిందకే వస్తుందని న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పులపాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. సమాజ హితం, శాంతిభద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లపై నిషేధం విధించడం సరైనదేనని న్యాయస్థానం సమర్థించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం నుంచి ఈ చరిత్రాత్మక తీర్పు వెలువడింది.

## సెంటిమెంటే...ఆయింట్ మెంట్ ఆత్మగౌరవ నినాదంతో అడుగులు

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ సెంటిమెంట్ తెరపైకి వస్తోంది. పదేళ్ల రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇప్పుడిప్పుడే పరిపాలన, అభివృద్ధి అంశాలపై చర్చ జరుగుతుందనుకుంటున్న తరుణంలో, మళ్ళీ ఆంధ్ర-తెలంగాణ భావోద్వేగాలను రగిల్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. తెలంగాణలో ప్రస్తుతం సాగుతున్న సెంటిమెంట్ రాజకీయాల వెనుక ప్రధానంగా బీఆర్‌ఎస్ సోషల్ మీడియా విభాగాలు క్రియాశీలకంగా కనిపిస్తున్నాయి. గతంలో కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాలను తెరపైకి తెచ్చి ప్రజల్లో సెంటిమెంట్‌ను రగిల్చేందుకు ప్రయత్నించినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. అయితే, ఇప్పుడు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ టార్గెట్ గా జరుగుతున్న రాజకీయం, పవన్ కూడా తెలంగాణపై దృష్టి సారించడం, మంగళవారం జరిగిన సమావేశం పరిణామాలను ఆయుధంగా చేసుకుని తెలంగాణ ఆత్మగౌరవం పేరుతో కొత్త ఉద్యమాన్ని లేవనెత్తాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. తద్వారా కోల్పోయిన రాజకీయ ఉనికిని మళ్ళీ చాటుకోవాలన్నది ఆ పార్టీ వ్యూహం. కాంగ్రెస్ పార్టీలో కూడా ఈ సెంటిమెంట్ వేడి కనిపిస్తోంది. అనిరుధ్ రెడ్డి, మందుల సామ్యూల్ వంటి నేతలు ఏపీ నేతలను టార్గెట్ చేస్తూ చేస్తున్న వ్యాఖ్యలు పార్టీ లైన్‌కు భిన్నంగా ఉన్నట్లు కనిపిస్తోంది. వీరు కూడా ప్రాంతీయ నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లాలని చూస్తున్నారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఈ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ప్రాంతీయ సెంటిమెంట్ మళ్ళీ బలపడితే, ఆ సెంటిమెంట్‌కు పేటెంట్ హక్కు కలిగిన బీఆర్‌ఎస్‌కే అంతిమంగా లాభం చేకూరుతుందని రేవంత్ గట్టిగా నమ్ముతున్నారు. అందుకే ఆయన భావోద్వేగాల కంటే బాధ్యతాయుతమైన పరిపాలనకే మొగ్గు చూపుతున్నారు. రేవంత్ రెడ్డికి ఒక స్పష్టమైన అవగాహన ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్‌ను కాదని కాంగ్రెస్‌ను ఎన్నుకున్నది కేవలం సెంటిమెంట్ కోసం కాదు, మార్పు , పరిపాలన కోసం. ఇప్పుడు మళ్ళీ అదే సెంటిమెంట్ ఉచ్చులో పడితే, కాంగ్రెస్ తన అభివృద్ధి అజెండాను పక్కన పెట్టాల్సి వస్తుంది. పైగా, ఏపీతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాలని ఆయన భావిస్తున్నారు. కానీ, తన సొంత పార్టీ నేతలు కొందరు కంట్రోల్ కాకుండా ఏపీపై విమర్శలు చేయడం ఆయనకు తలనొప్పిగా మారింది. రేవంత్ రెడ్డి ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి డ్యూయల్ స్ట్రాటజీ అమలు చేసే అవకాశం ఉంది. ఒకటి, పార్టీ నేతలకు కఠినమైన ఆదేశాలు జారీ చేయడం ద్వారా ఏపీ నేతలపై అనవసర వ్యాఖ్యలు చేయకుండా అడ్డుకోవడం. రెండు, బీఆర్‌ఎస్ చేస్తున్న సెంటిమెంట్ ప్రచారాన్ని రాజకీయ డైవర్షన్ గా ప్రజల్లోకి తీసుకెళ్లడం. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేయని పనులను ఇప్పుడు సెంటిమెంట్ పేరుతో కప్పిపుచ్చుకోవాలని చూస్తోందని ఆయన వాదించనున్నారు. పవన్ కళ్యాణ్ ఫ్యాక్టర్ కూడా ఈ సమీకరణాల్లో కీలకం. పవన్‌ను టార్గెట్ చేయడం ద్వారా సెంటిమెంట్‌ను పెంచాలని బీఆర్‌ఎస్ చూస్తుంటే, రేవంత్ మాత్రం దాన్ని కేవలం ఒక పొరుగు రాష్ట్ర నేత పర్యటనగా మాత్రమే పరిగణించాలనే ధోరణిలో ఉన్నారు. తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయాలు అనేవి ఒక డబుల్ ఎడ్జ్ స్వోర్డ్ లాంటివి. రేవంత్ రెడ్డి ఈ సెంటిమెంట్ వేవ్ ను సమర్థవంతంగా అడ్డుకోగలిగితేనే కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుంది. ఒకవేళ తన పార్టీ నేతలను కంట్రోల్ చేయడంలో విఫలమైతే, అది బీఆర్‌ఎస్‌కు ఆక్సిజన్ అందించినట్లు అవుతుంది.

## గ్రామాల్లో ఇంటర్ నెట్ స్పీడ్ కోసం నయా కార్పొరేషన్

హైదరాబాద్ : తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తెలంగాణ రూరల్ ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ అమెండెడ్ భారత్ నెట్ పథకం కింద కేంద్ర, రాష్ట్రాల సమాన భాగస్వామ్యంతో ఇది పనిచేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి మేరకు కేంద్రం కార్పొరేషన్ నిర్వహణ కోసం పదేళ్లకు రూ.2600 కోట్లు అలాగే తొలి విడతగా 3 లక్షల గ్రామీణ కనెక్షన్ల కోసం రూ.300 కోట్లు మంజూరు చేసింది. తెలంగాణలోని పల్లెపల్లెకూ హైస్పీడ్ డిజిటల్ నెట్‌వర్క్‌ను అనుసంధానం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విప్లవానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమెండెడ్ భారత్ నెట్ పథకంలో భాగంగా.. తెలంగాణ రూరల్ ఇంటర్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఖీఎఎఅఒ)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర టెలీకమ్యూనికేషన్ల శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమాన భాగస్వామ్యంతో ఈ నూతన సంస్థ పనిచేయనుంది. ఈ కొత్త కార్పొరేషన్ బోర్డులో ఇరుపక్షాలకూ సమాన ప్రాధాన్యత కల్పించారు. బోర్డు సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక సీఈవోతో పాటు ఐటీ, ఆర్థిక, పంచాయతీరాజ్, ఇంధన శాఖల ఉన్నతాధికారులు నలుగురు డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తరఫున ఎక్స్ అఫీషియో ఛైర్మన్‌తో పాటు మరో నలుగురు డైరెక్టర్లు ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో సేవలందిస్తున్న తెలంగాణ ఫైబర్‌గ్రిడ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ కొత్త కార్పొరేషన్‌కు కూడా సీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు తెలంగాణకు గరిష్ట ప్రయోజనం చేకూర్చేలా కొత్త కార్పొరేషన్ ఏర్పాటు నిబంధనల్లో కొన్ని కీలక వెసులుబాట్లు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

# సీఎం పర్యటన నేపథ్యంలో వట్టెం రిజర్వాయర్ వద్ద ఏర్పాట్ల పరిశీలన

(సమయం నాగర్ కర్నూల్ ప్రతినిధి) : రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన వట్టెం వెంకటేశ్వర రిజర్వాయర్ పంప్‌హౌస్‌ను సందర్శించనున్న నేపథ్యంలో బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి లు సంయుక్తంగా ఏర్పాట్లను పరిశీలించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని కుమ్మెర గ్రామ సమీపంలో ఉన్న వట్టెం వెంకటేశ్వర రిజర్వాయర్, పంప్‌హౌస్ ప్రాంతాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 5 న సందర్శించనున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని ఎల్లూరు రిజర్వాయర్, హెడ్ రెగ్యులేటర్, నార్లాపూర్ రిజర్వాయర్ ,డెలివరీ సిస్టర్న్,ఎం జి కె ఎల్ ఐ లిఫ్ట్ -1 పంప్ హౌస్ పరిశీలించిన అనంతరం హెలికాప్టర్ ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్ , హెడ్ రెగ్యులేటరీ, ప్యాకేజ్ 3 కెనాల్ పనులు, ఏదుల రిజర్వాయర్ పంప్ హౌస్ పనులను పరిశీలించిన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి కుమ్మెర చేరుకుంటారు. వట్టెం రిజర్వాయర్ కి సంబంధించి ప్యాకేజీ 8 ,9, 10,11 పనులను తనిఖీ చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై కుమ్మెర గెస్ట్ హౌస్ వద్ద సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించి, అక్కడి భద్రతా ప్రమాణాలు, వాహనాల పార్కింగ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధుల కోసం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలపై అధికారులకు జిల్లా కలెక్టర్ ,ఎస్ పి తో పాటు సి ఎం భద్రతా అధికారులు పలు సూచనలు చేశారు. అనంతరం వట్టెం రిజర్వాయర్ పంప్‌హౌస్ వద్ద నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి ఎం పర్యటనకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి ప్రయాణ మార్గాలు, భద్రత, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ తరపున పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సున్నిత ప్రాంతాలను గుర్తించి అదనపు పోలీసు బలగాలను మోహరించనున్నట్లు పేర్కొన్నారు. వాహనాల తనిఖీలు, ప్రవేశ నియంత్రణ, ట్రాఫిక్ మళ్లింపులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి కూడా భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించి, సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.






## ఒంటరైన చిన్నారికి మేఘున్న అభయహస్తం అందజేత



వనపర్తి. సమయం ప్రతినిధి : పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన రేణుక దీర్ఘకాల వ్యాధితో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. ముదిరాజ్ కుటుంబానికి చెందిన రేణుక తల్లిదండ్రులు చనిపోయారు, భర్త లేడు, తాను చనిపోతానని తెలిసి తన చిన్నారి కూతురు భవ్యశ్రీని కంటికి రెప్పలా కాపాడుకుంటూ 5వ తరగతి వరకు చదివించింది గత కొంతకాలంగా ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇంట్లోనే ఉండేది. మంగళవారం రాత్రి అనుకోకుండా ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించింది ఆసుపత్రికి తీసుకువెళ్లిన ఫలితం లేకపోయింది. మృతి చెందడంతో ఆమె తరపు బంధువులు ఆసుపత్రి నుంచి మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. తనకున్న ఒకే ఒక ఆధారం తన తల్లి చనిపోవడంతో ఆ చిన్నారి హృదయ వేదనతో ఏడ్చిన ఏడుపులు చూపరులను సైతం కన్నీళ్లు పెట్టించాయి. రేణుక మృతదేహాన్ని ఖననం చేసేందుకు కూడా ఆర్థిక స్తోమత లేకపోవడంతో గ్రామస్తులు చందాలు వేసుకుని ఆమె దహన సంస్కారాలకు తోడ్పాటు అందించారు. విషయం తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తీవ్ర మనోవేదనకు గురై తక్షణ సహాయంగా 5000 రూపాయలు అందించారు చిన్నారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆమె చదువును, బాగోగులను సైతం చూస్తానని అధైర్యం వద్దని ఎమ్మెల్యే భరోసా కల్పించారు.

## 9 జిల్లాల్లో మహిళా శక్తి బజార్లు

ఖమ్మం : తెలంగాణలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలను అమలు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు.. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా మహిళా సూపర్ బజార్లు, లాజిస్టిక్స్ హబ్‌లు, ఆధునిక రైస్‌మిల్లులను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ వేగంగా అడుగులు వేస్తోంది. మహిళా సంఘాల ద్వారానే వీటిని సమర్థవంతంగా నిర్వహించి, వారిని వ్యాపారవేత్తలుగా మార్చాలనేది ప్రభుత్వ ప్రధాన సంకల్పం.ఈ బృహత్తర ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో వేగవంతం చేసేందుకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ సోమవారం రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తొలి దశ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఒకేసారి కాకుండా.. ప్రాథమికంగా తొమ్మిది ఉమ్మడి జిల్లా కేంద్రాలైన హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, సంగారెడ్డిలలో ఒక్కొక్కటి చొప్పున మహిళా శక్తి సూపర్ బజార్లను స్థాపించాలని ప్రతిపాదించారు. ప్రముఖ రిటైల్ సంస్థ డీమార్ట్ తరహాలోనే ఈ సూపర్ బజార్లలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల నిత్యావసర సరకులు, గృహోపకరణాలు, వివిధ రకాల పరికరాలను తక్కువ ధరలకే విక్రయించేలా ఖమ్మంలో మొదటి పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నారు.ఈ సూపర్ బజార్ల నిర్మాణానికి జనాభా సాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సుమారు 5 వేల గజాల స్థలం అవసరమని సెర్ప్ అధికారులు గుర్తించారు. అనువైన ప్రభుత్వ భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ఆయా జిల్లాల కలెక్టర్లకు తక్షణమే లేఖలు రాయాలని నిర్ణయించారు. మరోవైపు.. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లాలో లాజిస్టిక్స్ హబ్, రైస్‌మిల్లు ఏర్పాటుకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని, ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఖమ్మం జిల్లాలో భారీ గోదాం, లాజిస్టిక్స్ హబ్, రైస్ మిల్లుల స్థాపన కోసం దాదాపు 20 ఎకరాల భూమిని కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక ప్రతిపాదనలు పంపేందుకు సెర్ప్ సిద్ధమైంది. ఈ మెగా ప్రాజెక్టుల విజయవంతమైన నిర్వహణకు గానూ.. ఆయా జిల్లాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్న మహిళా సమాఖ్యలను ఎంపిక చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు సెర్ప్ ఆదేశాలు జారీ చేసింది.

## ప్రజలపై భారాలు మోపుతున్న మోడీ బలమైన ప్రధానా: సిపిఐ




(సమయం ప్రతినిధి వనపర్తి) : ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్న నరేంద్ర మోడీ బలమైన ప్రధాని ఎలా అవుతారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ ప్రశ్నించారు. బుధవారం రాత్రి జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతం అధ్యక్షతన వనపర్తి సిపిఐ ఆఫీసులో జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ.. దేశాన్ని పాలించిన గత ప్రధానులు 55 వేల లక్షల కోట్లు అప్పులు చేసి ఎన్నో ప్రాజెక్టులు, పరిశ్రమలు నిర్మించి ప్రజలకు ఉపాధి చూపించారన్నారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన 12 ఏళ్లలో రెండు లక్షల 50 వేల లక్షల కోట్లు అప్పులు తెచ్చి ఒక్క ప్రాజెక్టు పరిశ్రమ నిర్మించి యువతకు ప్రజలకు ఉపాధి కల్పించకపోగా, సామాన్యులపై పెట్రోలు డీజిల్ వంటగ్యాస్ వాణిజ సిలిండర్ల ధరలను పెంచారన్నారు. ఫలితంగా నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులకు భారంగా మారాయి అన్నారు. 2014 ముందు మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నారని అంతర్జాతీయ మార్కెట్లో ఆనాడు బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర108 డాలర్లు ఉండగా రూ. 65 కే లీటర్ పెట్రోల్ లభించింది అన్నారు. అయినప్పటికీఆనాడు బిజెపి ఆయనను బలహీనమైన ప్రధాని అని విమర్శించిందని, నేడు అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 98 డాలర్లు ఉందని కానీ పెట్రోల్ ధర మాత్రం రూ. 118 కి పెంచారన్నారు. ప్రజలపై భారం మోపిన నరేంద్ర మోడీ బలమైన ప్రధాని ఎలా అవుతారని ప్రశ్నించారు. రష్యా చమురు తక్కువ ధరకు భారతదేశం కొంటుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కొనవద్దని బెదిరిస్తే కొనటం లేదని, ఇతర దేశాల నుంచి ఎక్కువ ధరకు కొన్ని చమురు భారం ప్రజలపై మోపారని అలాంటప్పుడు మోదీ బలమైన ప్రధానిగా బిజెపి ప్రచారం చేయటం బూటకమన్నారు. దేశభక్తి, మత విశ్వాసాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారం చేస్తున్నారని ప్రజలు గ్రహించి బిజెపికి బుద్ధి చెప్పాలని కోరారు. రాష్టంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని, రైతు భరోసా చెల్లించాలని, వరి మొక్కజొన్న పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లను రాజకీయాలకతీతంగా అర్హులకు ఇవ్వాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ కృష్ణవేణి గీత శ్రీరామ్ రమేష్ రాబర్ట్ మోష అబ్రహం కుతుబ్ గోపాల్ భరత్ నరసింహ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ చలాన్లపై బిగ్ అప్‌డేట్..

# నెల రోజులే గడువు, త్వరపడండి

హైదరాబాద్ : ట్రాఫిక్ చలాన్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాహనదారులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని తేల్చి చెప్పింది. ఇందుకోసం నెల రోజుల గడువు ఇచ్చింది. నెల రోజుల తర్వాత వివరాలు నమోదు చేసుకోకపోయినా.. ట్రాఫిక్ చలాన్ పంపించినట్లుగానే భావిస్తామని స్పష్టం చేసింది. ట్రాఫిక్ చలాన్ల విషయంలో మరింత కఠిన వైఖరి అనుసరించడంలో భాగంగా సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. రోడ్లపై ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వాహనదారులపై పోలీసులు చలాన్‌లు విధించి.. వారిపై కొరఢా ఝుళిపిస్తూ ఉంటారు. అయితే కొంతమంది వాహనదారులపై అనేక ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉన్నా.. పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరుగుతూ ఉంటారు. ఈ క్రమంలోనే కొందరు వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు దొరికినప్పుడు వారి బండి నంబర్ ఆధారంగా చెక్ చేస్తే.. వేలల్లో ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉండటం మనం చూస్తూనే ఉన్నాం. చాలా మంది పోలీసులకు చిక్కకుండా.. ట్రాఫిక్ చలాన్లను కట్టకుండా.. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమిస్తూ.. ఫైన్లు కొండలా పేరుకుపోయే వరకు ప్రయాణిస్తూ ఉంటారు. అయితే ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే తెలంగాణలోని వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఇక నుంచి ట్రాఫిక్ చలాన్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పక్కాగా ఓనర్లకు చేరేలా తెలంగాణ రవాణా శాఖ సరికొత్త నిబంధనను అమలులోకి తీసుకొచ్చింది. ట్రాఫిక్ చలాన్లకు సంబంధించిన అలర్ట్స్‌ను ఎప్పటికప్పుడు పొందేందుకు ప్రతీ ఒక్కరూ తమ వివరాలను వెంటనే వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేసుకోవాలని స్పష్టం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కొత్త నిబంధనల ప్రకారం.. ప్రతీ ఒక్క వాహనదారుడు తమ మొబైల్ నంబర్, వాట్సాప్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ వంటి వివరాలను నెల రోజుల్లోగా కేంద్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ అయిన వాహన్ తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇక ప్రభుత్వం ఇచ్చిన నెల రోజుల గడువు ముగిసిన తర్వాత.. వాహన్ పోర్టల్‌లో నమోదై ఉన్న సెల్ నంబరు, ఈ-మెయిల్‌కు ఎస్ఎంఎస్, వాట్సాప్, మెయిల్ ద్వారా ట్రాఫిక్ చలాన్లను సంబంధిత వాహన యజమానికి పంపిస్తారు. ఇలా పంపిన ట్రాఫిక్ చలాన్లు.. వారికి అందినట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. ఇంతకుముందు లాగా.. తమ ఫోన్‌కు ట్రాఫిక్ చలాన్ రాలేదని.. దానికి సంబంధించి మెసేజ్ కూడా రాలేదని.. అసలు తమ బండిపై ట్రాఫిక్ చలాన్ ఉందనే సమాచారం కూడా తమకు తెలియదని వాహనదారులు చలాన్లు తప్పించుకోవడానికి వీలు ఉండదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గతంలో ఇలాంటి సాకులు చెప్పి.. కొందరు వాహనదారులు ట్రాఫిక్ చలాన్లు కట్టకుండా తప్పించుకునే వారని తెలిపాయి. పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్ల వసూళ్లను మరింత వేగంగా వసూలు చేయడానికి.. ట్రాఫిక్ చలాన్ల విషయంలో మరింత పారదర్శకతను పెంచడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

వేకువ సమయం
గురువారం 04 జూన్ 2026

# రాష్ట్రంలో 33 శాతం అటవీ సంపదను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు








**-వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**

**వనపర్తి, ప్రమాదం ప్రతినిధి:** ప్రజలందరికీ మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించి, రాష్ట్రంలో 33 శాతం అటవీ సంపదను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఏకో పార్కులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణం పై అవగాహన కల్పిస్తూ సైక్లింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సైక్లింగ్ కార్యక్రమానికి వనపర్తి మున్సిపల్ చైర్పర్సన్ మాధవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, స్థానికులతో కలిసి ఎకో పార్కులో ఐదు కిలోమీటర్ల మేర సైక్లింగ్, వాకింగ్ కార్యక్రమంలో పాల్గొని సైకిల్ తొక్కి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరికీ మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించి, రాష్ట్రంలో 33 శాతం అటవీ సంపదను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని పేర్కొన్నారు. మానవాళి మనుగడకు చెట్లే ప్రాణాధారమని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారా భావి తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం అడవుల విస్తీర్ణాన్ని ఇంకా పెంచేందుకు చర్యలు చేపట్టబోతుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి అడవుల పెంపకం పై అవగాహన కల్పిస్తామని చెప్పారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్ సందర్శించి అటవీ శాఖ పరిధిలో చెక్ డాం లు, కుంటాలను పరిశీలన చేయడం జరిగింది అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా అదేవిధంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఎకో పార్కులో సైక్లింగ్ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. మొక్కలు నాటడం పై ప్రజలలో అవగాహన కల్పించి, జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే, కలెక్టర్ కు చిత్ర ప్రదర్శన ద్వారా అటవీశాఖ అధికారులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి శివ ఆశిష్, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, డిపిఆర్ఓ సీతారాం, డి వై ఎస్ ఓ సుధీర్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ ఫ్లైఓవర్ కోసం సర్కార్ గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్ : హైదరాబాద్‌లో మరో భారీ ఫ్లైఓవర్ నిర్మించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎల్‌బీ నగర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మార్గంలో.. ఇప్పటికే చాలా ఫ్లైఓవర్లు నిర్మించగా.. తాజాగా మరొకటి నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.416 కోట్లను కూడా కేటాయించింది. త్వరలోనే ఈ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం భూసేకరణ పనులు చేపట్టేందుకు అధికారులు రెడీ అయ్యారు. విశ్వనగరంగా మారుతున్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ తగ్గించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లను గుర్తించి.. అక్కడ భారీ ఫ్లైఓవర్లను నిర్మిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా నగరంలో మరో ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఎల్‌బీ నగర్ జోన్‌లో రూ.416 కోట్లతో 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. హైదరాబాద్ నగరంలోని తూర్పు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. టీకేఆర్ కాలేజీ, గాయత్రీనగర్, మందమల్లమ్మ జంక్షన్ల మీదుగా నిర్మించనున్న ఈ ఫ్లైఓవర్ వల్ల ఎయిర్‌పోర్టు మార్గంలో ట్రాఫిక్ తగ్గనుంది. అంతేకాకుండా మీర్‌పేట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం లభించనుండగా.. ఎల్‌బీ నగర్ నుంచి పాతబస్తీ వైపు ప్రయాణం కూడా మరింత సులభతరం కానుంది. త్వరలోనే భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ పనులు ప్రారంభం కానున్నాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని ఎల్‌బీ నగర్ జోన్‌లో రూ.416 కోట్ల వ్యయంతో ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. టీకేఆర్ కాలేజీ జంక్షన్, గాయత్రీనగర్ జంక్షన్, మందమల్లమ్మ జంక్షన్‌ల మీదుగా ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేషన్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు కింద ఈ పనులను ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) టర్న్‌కీ విధానంలో కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ చేపట్టనుంది. ఎల్బీ నగర్ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే మార్గంలో ప్రస్తుతం ఈ 3 జంక్షన్ల వద్ద తీవ్రంగా ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది. మరీ ముఖ్యంగా గత 10 ఏళ్లలో మీర్‌పేట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ వంటి ప్రాంతాల్లో జనాభా గణనీయంగా పెరగడంతో పాటు.. వాహనాల రాకపోకలు కూడా భారీగా పెరిగాయి. దీంతో ఈ ప్రాంతాల నుంచి నగరానికి వెళ్లే ప్రయాణికులతో నిత్యం ఆ మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి అయితే నగర తూర్పు భాగాన్ని విస్తరించిన దక్షిణ ప్రాంతాలతో అనుసంధానం చేయడంలో కీలక పాత్ర పోషించనుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. మీర్‌పేట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ ప్రాంతాల ప్రజలకు వేగవంతమైన రాకపోకలు అందుబాటులోకి రానున్నాయని చెబుతున్నాయి. అలాగే ఎల్‌బీ నగర్ జంక్షన్ నుంచి సంతోష్‌నగర్ మీదుగా పాతబస్తీ వైపు వెళ్లే ప్రయాణికులకు కూడా ప్రయాణ సమయం భారీగా తగ్గే అవకాశం ఉందని వెల్లడిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఫ్లైఓవర్‌కు సంబంధించి.. త్వరలోనే భూసేకరణ, విద్యుత్ లైన్లు, నీటి పైపులు వంటి యుటిలిటీ షిఫ్టింగ్ పనులను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే నగర తూర్పు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

### రహదారిపై గాయాలతో వ్యక్తి మృతదేహం లభ్యం

చిలకలూరిపేట : చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామంలో వేలూరు గ్రామం నుండి జాలాది వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఒక వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని స్థానిక గ్రామస్తులు గమనించారు. రోడ్డుపై మృతదేహం ఉండటంతో భయాందోళనకు గురైన స్థానికులు, వెంటనే చిలకలూరిపేట రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుడి శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలు ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. దీంతో ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా (హత్య జరిగి ఉండవచ్చనే కోణంలో) పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఎవరు? అసలు అక్కడ ఏం జరిగింది? అనే పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

### ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్

వనపర్తి : జిల్లా కేంద్రంలోని ఏకో పార్కులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణం పై అవగాహన కల్పిస్తూ సైక్లింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, స్థానికులతో కలిసి ఎకో పార్కులో ఐదు కిలోమీటర్ల మేర సైక్లింగ్, వాకింగ్ కార్యక్రమంలో పాల్గొని సైకిల్ తొక్కి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేశారు.

### మాకో అవకాశం ఇవ్వండి

విజయవాడ : తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ పదవులపై చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. అందులో సీనియర్ నేతలు ఎక్కువ మంది ఈ పదవిని ఆశిస్తున్నారు. కానీ పదవులు తక్కువ.. ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. ఇది టీడీపీ నాయకత్వానికి కొంత ఇబ్బందిగా మారే అవకాశముంది. తాము పార్టీ కోసం పడిన కష్టాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ ను కలిసి తమ వినతులను సమర్పించారు. తమకు పెద్దల సభలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కానీ నాయకత్వం మాత్రం రాజ్యసభ స్థానాల విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి వచ్చింది. వర్ల రామయ్య, యనమల రామకృష్టుడు, కంభంపాటి రామ్మోహన్ రావు వంటి నేతలు తమకు రాజ్యసభ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూడా కీలక కామెంట్స్ చేశారు. తన తర్వాత తన కుటుంబానికి కూడా రాజకీయంగా సేవ చేసే అవకాశం ఇవ్వాలని అయ్యన్న పాత్రుడు కోరారు. ఇరవై ఐదేళ్ల వయస్సు నుంచి టీడీపీలో సేవలందిస్తున్నానన్న ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు తన కుటుంబానికి కూడా అవకాశం కల్పించాలని కోరారు. అంటే పరోక్షంగా తన కుమారుడు చింతకాయల విజయ్ ను రాజ్యసభకు పంపాలని కోరినట్లు నాయకత్వానికి చెప్పకనే చెప్పినట్లయింది. తెలుగుదేశం పార్టీ కోసం జీవితాంతం పనిచేశానని అయ్యన్న పాత్రుడు భావోద్వేగంగా మాట్లాడారు. తన కుటుంబ సభ్యులకు కూడా పార్టీకి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరిన స్పీకర్ అయ్యన్న అందుకు అవకాశమివ్వాలని పార్టీ నాయకత్వాన్ని కోరారు. త్వరలో రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులను ఎంపిక చేస్తున్న సమయంలో అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలకు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. టీడీపీలో రాజ్యసభ ఆశావహుల మధ్య అయ్యన్న పాత్రుడి వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. మరి రాజ్యసభకు టీడీపీ నాయకత్వం ఎవరిని ఎంపిక చేస్తుందన్నది.

## రాబోయే విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 100 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యేలా ప్రణాళికలు రూపొందించాలి

**-ఫిజిక్స్, ఇంగ్లీష్ విషయాలపై శ్రద్ధ వహించి, వెనకబడిన వారి కోసం సులభమైన పద్ధతిలో ప్రత్యేక పుస్తకాన్ని తయారు చేయాలని ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచన**

**వనపర్తి, సమయం ప్రతినిధి :** రాబోయే విద్యా సంవత్సరంలో జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పదో తరగతి ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులపై విద్యార్థులకు ప్రత్యేక బోధన అంశంపై జిల్లా కలెక్టర్ సంబంధిత ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవలి ఎస్సెస్సీ ఫలితాలను సమీక్షిస్తూ ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవలి పదో తరగతి ఫలితాల్లో ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో కొందరు విద్యార్థులు అనుతీర్ణులు అయిన నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరంలో ఆయా సబ్జెక్టులపై దృష్టి పెట్టాలని సూచించారు. గత సంవత్సరం గణితంలో వెనకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక పుస్తకాన్ని రూపొందించి, ప్రత్యేకంగా బోధించి మంచి ఫలితాలు సాధించినట్లే, ఈసారి ఫిజిక్స్ మరియు ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో కూడా అదే విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. విద్యార్థులకు ఫిజిక్స్ మరియు ఇంగ్లీష్ సులభంగా అర్థమయ్యే విధంగా ప్రాథమిక అంశాలతో కూడిన ప్రత్యేక పుస్తకాలను రూపొందించాలని, ఈ నెలాఖరులోగా ఆ పుస్తకాల తయారీ పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ముందుగా ఈ సంవత్సరం పదో తరగతి చదివే విద్యార్థులకు సులభ పరీక్ష నిర్వహించి ఫిజిక్స్ మరియు ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని సూచించారు. అనంతరం వారికి ఇపుడు రూపొందించబోయే పుస్తకం ద్వారా ప్రాథమిక స్థాయి నుండి బోధిస్తూ సబ్జెక్టులపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఈ సబ్జెక్టులతో పాటు అన్ని సబ్జెక్టుల్లో ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. సమావేశంలో గణిత, ఫిజిక్స్,



ఇంగ్లీష్ సంబంధిత ఉపాధ్యాయులు తదితరులు

# పాలమూరులో ముఖ్యమంత్రి రెండు రోజుల పర్యటన సాగేది ఇలా...

(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు రోజులపాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో మంత్రులతో కలిసి ఉచితంగా పర్యటిస్తారు ఆయన పర్యటన వివరాలు అధికార వర్గాల ద్వారా పేలుడు అయ్యాయి ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటన ఈ విధంగా సాగుతుంది ముఖ్యమంత్రి వెంట జిల్లాలోని మంత్రులు తోపాటు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి ఉంటారు.

**జూన్ 4 (గురువారం)**

మధ్యాహ్నం 3 గంటలకు నారాయణపేట జిల్లా మక్తల్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.

మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల వరకు మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం (ఎంఎన్‌కేఎల్ఐఎస్), భీమా, కృష్ణా నదులపై ప్రతిపాదిత బ్యారేజీల పనుల పురోగతిని అధికారులు వివరిస్తారు.

మధ్యాహ్నం 3.40 గంటల నుంచి 4 గంటల వరకు మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలిస్తారు.

సాయంత్రం 4.10 గంటలకు మక్తల్ హెలిప్యాడ్ కు చేరుకుంటారు.

సాయంత్రం 4.10 గంటలకు కోయిల్‌సాగర్ ప్రాజెక్టు, కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదిత బ్యారేజీలు, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డ్యామ్ ప్రాంతాన్ని ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలిస్తారు.

సాయంత్రం 4.50 గంటలకు జోగులాంబ గద్వాల జిల్లా ధారూర్ మండలం గూడెందొడ్డి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు

సాయంత్రం 4.55 గంటల నుంచి 5.30 గంటల వరకు గూడెందొడ్డి రిజర్వాయర్, జేఎన్‌ఎల్ఐఎస్ స్టేజ్-1 పంప్‌హౌస్‌ను పరిశీలిస్తారు.

**అక్కడి నుంచి బయలుదేరి**

సాయంత్రం 6 గంటలకు సోమశిల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.

సాయంత్రం 6.45 గంటల నుంచి రాత్రి 8.45 గంటల వరకు మృగవాణి రిసార్ట్ రివర్‌ఫ్రంట్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.

**జూన్ 5 (శుక్రవారం)**

ఉదయం 10.30 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు పంప్‌హౌస్‌కు చేరుకుంటారు.

ఉదయం 10.40 గంటల నుంచి 11.40 గంటల వరకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్) ప్యాకేజీ-3 హెడ్ రెగ్యులేటర్, ప్యాకేజీ-2 నార్లాపూర్ రిజర్వాయర్, ప్యాకేజీ-1 డెలివరీ సిస్టర్న్, ఎంజీకేఎల్ఐఎస్ లిఫ్ట్-1 పంప్‌హౌస్‌లను పరిశీలిస్తారు.

ఉదయం 11.50 గంటల నుంచి మధ్యాహ్నం 12.20 గంటల వరకు నార్లాపూర్ హెలిప్యాడ్ నుంచి బయలుదేరి పీఆర్ఎల్ఐఎస్ ప్యాకేజీ-3 కాలువ పనులు, ఏదుల రిజర్వాయర్, పంప్‌హౌస్ పనులను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలిస్తారు.

మధ్యాహ్నం 12.20 గంటలకు కుమ్మెర హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.

అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు పీఆర్ఎల్ఐఎస్ ప్యాకేజీ-8 స్టేజ్-3 పంప్‌హౌస్, వట్టెం రిజర్వాయర్‌కు సంబంధించిన ప్యాకేజీ - 9, 10, 11 పనులను పరిశీలిస్తారు.

మధ్యాహ్నం 2 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కొత్తూర్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.10 గంటల నుంచి 2.30 గంటల వరకు పీఆర్ఎల్ఐఎస్‌కు చెందిన కరివేన రిజర్వాయర్ ప్యాకేజీ- 14, 15 పనులను పరిశీలిస్తారు.

మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 4.30 గంటల వరకు మీడియా సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.

అనంతరం సాయంత్రం 5 గంటలకు జడ్చర్ల మండలం ఉదండాపూర్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.

సాయంత్రం 5.10 గంటల నుంచి 5.40 గంటల వరకు పీఆర్ఎల్ఐఎస్‌కు చెందిన ఉద్దండాపూర్ రిజర్వాయర్ ప్యాకేజీలు 17, 18 పనులను పరిశీలిస్తారు.

సాయంత్రం 6.30 గంటలకు ఉదండాపూర్ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు.

సభ అనంతరం రాత్రి 7.30 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

## పెట్రోల్, గ్యాస్ కష్టాలు తీరినట్టే... అమల్లోకి వచ్చిన సీఈపీఏ

న్యూఢిల్లీ : అమెరికా? ఇరాన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా భారత్ ఇంధన రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ ధరలు భారీగా పెరిగి, సరఫరా కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వానికి ఊరట లభించింది.హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచంలోని అత్యధిక చమురు, గ్యాస్ రవాణా జరుగుతుంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల వల్ల నౌకల రవాణాలో అంతరాయం ఏర్పడటం తో భారత్‌కు ఇంధన సరఫరా దెబ్బతిన్నది. దీని ప్రభావంతో పెట్రోల్, ఎల్‌పీజీ ధరలు పెరిగాయి. సరఫరా కొరత ఏర్పడింది. పానిక్ బయింగ్ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత్‌కు ప్రత్యామ్నాయ మార్గం అవసరమైంది.భారత్?ఒమన్ మధ్య కుదిరిన కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్ (సీఈపీఏ) 2025, జూన్ నుంచి అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఒమన్‌లోని ప్రధాన పోర్టులు (సలాలా, దుక్మ్ వంటివి) ద్వారా భారత్‌కు చమురు, ఎల్ఎన్‌జీ, ఇతర ఇంధన ఉత్పత్తులు ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా అవుతాయి. ఒమన్ తీర ప్రాంతం హోర్ముజ్ జలసంధికి వెలుపల ఉండటం ఈ ఒప్పందాన్ని వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైనదిగా మార్చింది. ఇది భారత్‌కు సురక్షితమైన, నమ్మదగిన ఇంధన సరఫరా మార్గాన్ని అందిస్తోందిఒమన్‌తో ఒప్పందం కారణంగా హోర్ముజ్‌పై అత్యధిక ఆధారపడటం తగ్గుతుంది. పెట్రోల్, ఎల్‌పీజీ, డీజిల్ సరఫరా స్థిరంగా ఉంటుంది. ధరల పెరుగుదల నియంత్రణలో ఉంటుంది. ప్రజల ఆందోళన తగ్గి, సాధారణ సరఫరా పరిస్థితి ఏర్పడుతుంది.ఈ ఒప్పందం కేవలం తాత్కాలిక పరిష్కారం కాదు. దీర్ఘకాలికంగా భారత్ ఇంధన దిగుమతులను వైవిధ్యపరచడంలో, సప్లై చైన్‌ను బలోపేతం చేయడంలో మైలురాయిగా నిలుస్తుంది.ప్రస్తుత భూరాజకీయ పరిస్థితులు ఏ సమయంలోనైనా హోర్ముజ్ జలసంధిని ప్రభావితం చేసే అవకాశం ఉంది. అలాంటి సమయంలో ఒమన్ లాంటి స్నేహపూర్వక దేశంతో బలమైన వాణిజ్య ? ఇంధన భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవడం భారత్ దూరదృష్టి, వ్యూహాత్మక విజ్ఞతను చూపిస్తోంది. ఇది భారత్ ఇంధన భద్రతలో కొత్త అధ్యాయం.

## బంగారం విక్రయిస్తున్న భారత్

ముంబై : పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల మన ఇంధన దిగుమతుల బిల్లు భారీగా పెరిగింది. అలాగే ఈ ఏడాది 2026 జనవరి నుంచి ఇప్పటి వరకు స్టాక్ మార్కెట్లలో రూ.2.25 లక్షల కోట్ల విలువైన ఈక్విటీలను విదేశీ మదుపరులు విక్రయించారు. తమ పెట్టుబడులను తీసుకెళ్లారు. ఈ కారణాలతో అమెరికా డాలర్‌కు గిరాకీ బాగా పెరిగింది. రూపాయి విలువ పడిపోతోంది. దీంతో మన దగ్గర ఉన్న విదేశీ మారకపు నిల్వల విలువ భారీగా పడిపోతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫారెక్స్ నిల్వలు రూ.728.49 బిలియన్ డాలర్లుగా ఉండగా అది 4 నెలల్లోనే 47 బిలియన్ డాలర్లు తగ్గిపోయి 681.40 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. వీటిని కాపాడుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 6 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.57 వేల కోట్లు విలువైన పసిడి నిల్వలను విక్రయించినట్లు ప్రముఖ వార్తా సంస్థ బ్లూమ్ బర్గ్ తెలిపింది.ఫారెక్స్ నిల్వలు వృథాగా పోకుండా చూసేందుకు బంగారం దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం రెట్టింపు కంటే పెంచి 15 శాతానికి చేసింది. ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉన్నా, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ఆర్థిక స్థితి దెబ్బతినకుండా చూసేందుకు పెట్రోల్, డీజిల్ ధరలనూ పెంచింది. అలాగే రిజర్వ్ బ్యాంక్ తన వద్ద ఉన్న నిల్వల్లో రూ.57 వేల కోట్ల పసిడిని మే 22తో ముగిసిన రెండు వారాల వ్యవధిలో విక్రయించింది. తద్వారా విదేశీ కరెన్సీ ఆస్తులకు ఈ మొత్తాన్ని జమ చేసుకుంది. మన ఫారెక్స్ నిల్వల్లో విదేశీ కరెన్సీ ఆస్తులు 543.032 బిలియన్ డాలర్లు కాగా పిసిడి నిల్వలు 114.786 బిలియన్ డాలర్ల మేర ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ లెక్కల ప్రకారమే 2 వారాల్లో పసిడి నిల్వల విలువ 6 బిలియన్ డాలర్లకు పైగా తగ్గింది.దేశ ఎగుమతుల కంటే దిగుమతులు బిల్లు భారీగా పెరుగుతోంది. దీంతో కరెంటు ఖాతా లోటు అంతకంతకూ అధికమవుతోంది.

# టీడీపికి కలిసి రాని రాజ్యసభ

విజయవాడ : తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ ఎన్నికల సందడి ఊపందుకుంది. రాష్ట్రంలో కూటమికి ఉన్న భారీ మెజారిటీ కారణంగా ఖాళీ అవుతున్న నాలుగు స్థానాలనూ కైవసం చేసుకోవడం నల్లేరుపై నడకే. అయితే, ఈ విజయోత్సాహం నడుమ పార్టీలో ఒక ఆసక్తికరమైన, పాత వివాదం మళ్ళీ తెరపైకి వచ్చింది. 1984 లో ఎన్టీఆర్ కాలం నుంచి నేటి వరకు పెద్దల సభకు వెళ్లిన నేతల చరిత్రను గమనిస్తే.. రాజ్యసభ సభ్యులు టీడీపీకి ఎప్పుడూ కలిసి రాలేదు అనే సెంటిమెంట్ క్యాడర్‌లో బలంగా వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు దాదాపు 46 మంది నేతలు ఆ పార్టీ తరఫున రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. అయితే ఈ సుదీర్ఘ చరిత్రలో ఒక చేదు నిజం పార్టీని నిరంతరం వెంటాడుతోంది. టీడీపీ తరఫున ఒకసారి కంటే ఎక్కువసార్లు రాజ్యసభకు వెళ్లిన నేతలలో అత్యధికులు కీలక సమయంలో పార్టీకి హ్యాండ్ ఇచ్చి వలస బాట పట్టారు. నాడు ఎన్టీఆర్ హయాంలో పార్టీలో అత్యంత కీలక చక్రం తిప్పిన పి. ఉపేంద్ర కాలం నుంచి.. నిన్నమొన్నటి సుజనా చౌదరి, సీఎం రమేష్ వరకు ఈ జాబితా చాలా పెద్దదిగానే ఉంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలవాల్సిన ఈ పెద్దలు .. సొంత ప్రయోజనాల కోసం లేదా కేసుల భయంతో పార్టీ లైన్ దాటడం ప్రతిసారీ క్యాడర్‌ను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.టీడీపీ చరిత్రలోనే అత్యంత ఘోరమైన పరాజయాన్ని మూటగట్టుకున్న 2019 ఎన్నికల తర్వాత ఈ రాజ్యసభ సభ్యుల వలసలు పరాకాష్టకు చేరాయి. అప్పట్లో టీడీపీకి ఉన్న ఆరుగురు రాజ్యసభ సభ్యుల్లో నలుగురు సుజనా చౌదరి, సి.ఎం. రమేష్, టి.జి. వెంకటేష్, గరికపాటి మోహన్ రావు ఒకేసారి గ్రూప్‌గా మారి, రాజ్యసభలో టీడీపీ పక్షాన్ని ఏకంగా బీజేపీలో విలీనం చేసేశారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం రెండు పైగా మూడు వంతుల మెజారిటీని వాడుకుని, అనర్హత వేటు పడకుండా వీరు సేఫ్‌గా కమలం గూటికి చేరిపోయారు. అంతకుముందు చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తులుగా, ఢిల్లీలో పార్టీ ముఖచిత్రాలుగా వెలిగిన వీరే.. పార్టీ ఓడిపోగానే పక్కదారి పట్టడం చంద్రబాబు రాజకీయ వ్యూహాల లోపాన్ని ఎత్తిచూపింది.ఈ వరుస వలసల వెనుక ఉన్న అసలు కారణంపై టీడీపీ క్షేత్రస్థాయి క్యాడర్, సీనియర్ లీడర్లలో తీవ్రమైన అసంతృప్తి ఉంది. ఎలక్షన్ల సమయంలో పార్టీ గెలుపు కోసం రాత్రింబవళ్లు లాఠీ దెబ్బలు తింటూ, జైళ్లకు వెళ్లే గ్రౌండ్ లెవెల్ లీడర్లను పక్కన పెట్టి.. కేవలం ఫండింగ్ చేసేవారికి, తెర వెనుక చక్రం తిప్పే కార్పొరేట్ శక్తులకే చంద్రబాబు రాజ్యసభ సీట్లు ఇస్తారనే విమర్శ మొదటి నుండి ఉంది. ఢిల్లీలో లాబీయింగ్‌లు నడపడానికి, వ్యాపార ప్రయోజనాలు కాపాడుకోవడానికి వచ్చే ఇలాంటి పారాచూట్ నేతలకు పార్టీ సిద్ధాంతాల పట్ల గానీ, కార్యకర్తల కష్టం పట్ల గానీ ఎలాంటి నిబద్ధత ఉండదు. అందుకే, అధికారం మారగానే వీరు తమ వ్యాపారాలను, కాంట్రాక్టులను కాపాడుకోవడానికి అధికార పార్టీలోకి జంప్ అయిపోతుంటారని క్యాడర్ గట్టిగా నమ్ముతోంది.ప్రస్తుతం జూన్ 2026 లో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో మళ్లీ లాబీయింగ్ మొదలైంది. కూటమి ఒప్పందంలో భాగంగా జనసేనకు ఒక సీటు కేటాయించగా, మిగిలిన మూడు సీట్లు టీడీపీ దక్కించుకోనుంది. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా ఉన్న సానా సతీష్ బాబు తో పాటు పాత కార్పొరేట్ ముఖాలు మళ్లీ సీట్ల కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈసారి నారా లోకేష్ నేతృత్వంలో అభ్యర్థుల ఎంపిక జరుగుతుండటంతో.. యువతకు, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న బీసీ, ఎస్సీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పాత తప్పులను పునరావృతం చేయవద్దని కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు.ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ స్థాయిలో తన వాయిస్ బలంగా వినిపించాలంటే రాజ్యసభ సభ్యుల పాత్ర కీలకం. కానీ టీడీపీ విషయంలో ఈ సభ్యులు కేవలం పవర్ బ్రోకర్లు గా మిగిలిపోతున్నారనేది నిజం. సురేష్ ప్రభు లాంటి బయటి వ్యక్తులకు కూడా గతంలో టీడీపీ సీటు ఇచ్చింది. ఈ ధోరణి మారకపోతే, భవిష్యత్తులో కూడా ఈ సీట్లు పార్టీకి కేవలం తాత్కాలిక అవసరాలకే ఉపయోగపడతాయి తప్ప, నమ్మకమైన లీడర్‌షిప్‌ను తయారు చేయలేవు. చంద్రబాబు నాయుడు ఈ ఎన్నికల్లో కేవలం ఆర్థిక అంగబలాన్ని మాత్రమే చూడకుండా, రాజకీయ అంగబలం, నమ్మకమైన చరిత్ర ఉన్నవారికే పెద్దల సభకు పంపితేనే ఈ రాజ్యసభ శాపం నుంచి టీడీపీ బయటపడగలదని టీడీపీ క్యాడర్ అభిప్రాయం.

## కమలానికి ఏమైంది...

నెల్లూరు : ఏపీలో బిజెపి ప్రక్షాళన దిశగా హై కమాండ్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పార్టీ నేతల వ్యవహార శైలిపై ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. పార్టీ అభివృద్ధిపై నేతలు పెద్దగా దృష్టి పెట్టడం లేదు. పైగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఉన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. పార్టీని బలోపేతం చేయడం లేదు. దీనిపై హై కమాండ్ కు స్పష్టమైన సమాచారం ఉంది. అందుకే నేతల తీరుపై పెద్దలు ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ ముఖ్యమైన నేతను పిలిచి గట్టిగానే క్లాసు పీకినట్లు తెలుస్తోంది. సదరు నాయకుడి ఎదుట నేతల పనితీరు, వ్యవహార శైలి బయట పెట్టినట్లు సమాచారం. అందుకే మొత్తం మార్పు దిశగా అడుగులు వేస్తామని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఏపీలో భారతీయ జనతా పార్టీ కనీసం సొంతంగా ఉనికి చాటుకునే పరిస్థితిలో లేదు. తెలుగుదేశం పార్టీతో కలిసిన సమయంలో మాత్రమే ఓట్లతో పాటు సీట్లు పెరుగుతున్నాయి. ఒంటరిగా పోరాటం చేస్తున్న ప్రతిసారి ఒక్క నియోజకవర్గంలో కూడా డిపాజిట్లు రావడం లేదు. 2014లో టిడిపితో కలిసి పోటీ చేస్తే ఎమ్మెల్యే తో పాటు ఎంపీ స్థానాలను దక్కించుకుంది బిజెపి. మొన్నటి ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఎనిమిది ఎమ్మెల్యేలతో పాటు రెండు పార్లమెంట్ స్థానాలు ఆ పార్టీకి దక్కాయి. అయితే ఇప్పుడు కూడా ఎంపీలతో పాటు ఎమ్మెల్యేలు ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. కనీసం పార్టీ కోసం పట్టించుకునే వారు కరువవుతున్నారుబిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడైన పివిఎన్ మాధవ్ పార్టీని అభివృద్ధి చేస్తారని హైకమాండ్ భావించింది. ఆయనపై చాలా రకాలుగా అంచనాలు పెట్టుకుంది. కానీ ఎందుకో ఆయన ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదు. ప్రారంభంలో హడావిడి చేశారు. తరువాత ప్రెస్ మీట్ లకే పరిమితం అవుతున్నారు. దీంతో పార్టీ శ్రేణులకు అందుబాటులో లేరన్న విమర్శలు ఉన్నాయి. పార్టీకి పెద్దదిక్కుగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఆయనకు ఢిల్లీలో పరపతి ఉంది. సీఎం చంద్రబాబు వద్ద గౌరవం ఉంది. అందుకే ఆయన కేంద్ర ప్రభుత్వపరంగా, రాష్ట్ర ప్రభుత్వపరంగా పనులు చేసుకుంటున్నారు. స్థానికంగా పార్టీ శ్రేణులకు అందుబాటులో లేరన్న విమర్శ ఉంది. దగ్గుబాటి పురందేశ్వరి పరిస్థితి కూడా అదే. మొన్నటి ఎన్నికల వరకు ఆమె బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలుగా ఉండేవారు. ఇప్పుడు రాజమండ్రి ఎంపీగా కూడా ఉన్నారు. కనీసం వారంలో ఒక్కరోజు కూడా ఆమె అందుబాటులో ఉండడం లేదు. ఆమె తరుపున కూడా ఎవరు లేకుండా పోయారు పార్లమెంట్ నియోజకవర్గంలో. ఇవన్నీ పార్టీ దృష్టికి వెళ్లాయి కూడా.. అందుకే హై కమాండ్ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. మూడు పార్టీలు కలిసి వెళ్తాయి. కానీ క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీకి బలం లేదు. ఆ బలం పెంచుకునే ప్రయత్నం కూడా జరగలేదు. జిల్లా కమిటీలు ఉన్నాయంటే ఉన్నాయి. కనీసం గ్రామస్థాయి కమిటీలు లేవు. మండల కమిటీలు కానరావు. నియోజకవర్గాలు ఇన్చార్జులు ఉన్న ఫలితం లేదు. వాస్తవానికి భారతీయ జనతా పార్టీ ఇతర రాష్ట్రాల్లో బూత్ లెవెల్ లో బలమైన కమిటీలు ఉంటాయి. కానీ ఏపీ విషయానికి వచ్చినప్పుడు అటువంటి పరిస్థితి లేదు. ఇలానే కొనసాగితే ఏపీ బీజేపీలో ప్రక్షాళనకు హైకమాండ్ ప్రయత్నించే అవకాశం ఉంది. కచ్చితంగా చాలా రకాల మార్పులకు ఆ పార్టీ పెద్దలు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.



శ్రీచైతన్య గౌడీయ సంప్రదాయంలో శ్రీనిత్యానంద ప్రభువుకు ఉన్న స్థానం అద్వితీయమైనది. ఆయనను సాక్షాత్తూ బలరాముని అవతారంగా పరిగణిస్తారు. శాస్త్రాల విశ్లేషణ ప్రకారం బలరాముడు గురుతత్త్వానికి మూలపురుషుడు. కృష్ణుడి వివిధ లీలల్లో ఆయనకు తోడుగా నిలిచిన బలరాముడు... ఆ పరమాత్మ స్వరూపాన్ని భక్తులకు పరిచయం చేసిన ఆదిగురువు. శ్రీకృష్ణుడు కలియుగంలో చైతన్య మహా ప్రభువుగా అవతరించినప్పుడు... ఆయనకు సంకీర్తనా యజ్ఞంలో తోడ్పడడం కోసం బలరాముడు శ్రీ నిత్యానంద ప్రభువుగా ఆవిర్భవించారు. మహా ప్రభువు చేపట్టిన హరినామ ప్రచారంలో నిత్యానందుల పాత్ర ఎంతో కీలకమైనది. 'శ్రీ చైతన్య భాగవతం', 'చైతన్య చరితామృత' లాంటి గ్రంథాలు ఆయనను 'బలరామ స్వరూపం'గా నిర్ధారించాయి.

# హరినామప్రదాత

## కరుణకు ప్రతిరూపం

నిత్యానంద ప్రభువు కరుణామయుడిగా ప్రసిద్ధి చెందారు. ఆ కరుణతత్త్వం ద్వారానే ప్రజలకు చేరువయ్యారు. నవద్వీపధామంలో జగాయి, మధాయి అనే ఇద్దరు సోదరులు ఉండేవారు. వారు మద్యపానం, జూదం లాంటి దురలవాట్లకు లోనయ్యారు. అందరితోనూ అమర్యాదగా ప్రవర్తించేవారు. హింసా ప్రవృత్తితో భయపెట్టేవారు. వారిని ఉద్ధరించాలనే సంకల్పంతో శ్రీనిత్యానందుడు వారి వద్దకు వెళ్ళి, హరినామ సంకీర్తన చేయాలని కోరారు. మధాయి కోపంగా ఒక మట్టి కుండ పెంకుతో ఆయనపై దాడి చేశాడు. నిత్యానందుల నుదుటి నుంచి రక్తం ప్రవహించింది. అయినప్పటికీ ఆయన కోపగించుకోకుండా... "నన్ను కొట్టినా పరవాలేదు. ఒక్కసారి కృష్ణ నామాన్ని జపించండి" అని వేడుకున్నారు. ఈ వార్త తెలిసిన చైతన్య మహాప్రభువు ఆగ్రహంతో వారిని శిక్షించడానికి సుదర్శన చక్రాన్ని ప్రయోగించారు. నిత్యానందులు అడ్డుపడి, వారిని క్షమించాలని ప్రార్థించారు. ఈ అసమానమైన కరుణను చూసిన జగాయి తక్షణమే శరణాగతి పొందగా, మధాయి కూడా తన తప్పు తెలుసుకొని ప్రభువు పాదాలపై పడ్డాడు.

## ఆది గురువు

మాయావాద సంప్రదాయంలో అగ్రగణ్యుడైన సార్వభౌమ భట్టాచార్య... జగన్నాథపురిలో శ్రీ చైతన్య మహాప్రభువును దర్శించి, శిష్యుడిగా మారారు. ఆయన శ్రీనిత్యానందులను 'హరినామప్రదం దేవం' అని కొనియాడారు. అంటే 'హరినామాన్ని ప్రసాదించే దైవం' అని అర్థం. బద్ధ జీవులకు (సంసారంలో బందీలు అయిన వారికి) హరినామాన్ని ప్రసాదించే ఆది గురువు శ్రీనిత్యానంద ప్రభువు. జీవాత్మను శ్రీ చైతన్య మహాప్రభువుకు, పవిత్ర హరినామానికి అనుసంధానం చేసే వారధి ఆయనే. తనను కలిసిన ప్రతి ఒక్కరికీ భగవత్ ప్రేమను ఎలాంటి వివక్ష లేకుండా పంచారు. ఆయనకు ప్రతినిధిగా విశ్వగురువు శ్రీల ప్రభుపాదులు అందించిన సూచనలు, ఆదేశాలను పాటించడం ద్వారా ఎవరైనా తమ జీవితంలో అత్యున్నతమైన ఆధ్యాత్మిక ప్రయోజనాన్ని పొందవచ్చు. సాధారణ జీవితం సైతం నిత్యానంద ప్రభువు కృపతో, శ్రీల ప్రభుపాదుల మార్గదర్శకత్వంతో శాంతి యుతంగా, పరమానందభరితంగా మారుతుంది. 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించడం ద్వారా శ్రీకృష్ణుడిపట్ల అచంచలమైన భక్తి అనురాగం ఏర్పడతాయి. ఉన్నతమైన ఆ కృష్ణ చైతన్యంలో ఉన్న వ్యక్తి స్వార్థాన్ని విడిచిపెట్టి, పరోపకారమే పరమార్థంగా జీవిస్తాడు. శ్రీ నిత్యానంద ప్రభువు ఆవిర్భవించిన రోజైన మాఘ శుద్ధ త్రయోదశిని 'నిత్యానంద త్రయోదశి'గా ప్రపంచవ్యాప్తంగా ఇస్కాన్, హరేకృష్ణ మందిరాలు నిర్వహిస్తాయి. భక్తులు మధ్యాహ్నం వరకు ఉపవాసం ఉండి... శ్రీ నిత్యానందుని కృప కోసం ప్రార్థిస్తారు. ఆలయాల్లో శ్రీచైతన్య, శ్రీ నిత్యానంద విగ్రహాలకు మహాభిషేకం, విశేష అలంకారాలు చేసి, వందల రకాల పిండివంటలతో రాజభోగ్ నైవేద్యం సమర్పిస్తారు. వాటిని ప్రసాదంగా స్వీకరిస్తారు. నిత్యానందుని లీలలు, ఆయన చూపిన కరుణ, భక్తిమార్గంపై పండితులు ప్రవచనాలు చేస్తారు. రాత్రి నగర సంకీర్తన, విందులతో కార్యక్రమాలు ముగుస్తాయి.

# నాడు... నేడు మార్పే వారి మంత్రం

**ఇన్‌స్టాలోకి వెళ్లినా... ఫేస్‌బుక్ పేజీలు తిప్పినా... మనకు తరచూ కనిపించేవి... 'నాడు- నేడు' చిత్రాలు. సరదాకు కొందరు... అపురూపంగా కొందరు... తమను తాము 'పాత- కొత్త'లతో పోల్చుకొని మురిసిపోతుంటారు. కానీ మరికొందరు... నాడు రగిలించిన సామాజిక చైతన్యాన్ని... నేడూ కొనసాగిస్తూ... అదే స్ఫూర్తిని నింపుతుంటారు. అప్పుడు... ఇప్పుడు... మార్పు కోసం పరితపించే అలాంటి ఇద్దరు అమ్మాయిల పరిచయమే ఇది.**



## జన్నత్... దాల్ లేక్ కోసం

చిన్న వయసు... పెద్ద ఆలోచనలు. జన్నత్ పత్లూ ప్రయాణం ఆసాంతం సామాజిక అంశాలతోనే ముడిపడి సాగుతోంది. భూతల స్వర్గం కశ్మీర్‌లో పుట్టిన ఆమె... అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ పెరిగింది. నాలుగేళ్ల వయసు నుంచీ పడవలో తండ్రి పక్కన కూర్చొని ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన దాల్‌లేక్ సరస్సులో విహరించింది. ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్న సరస్సును కాలుష్యం నుంచి కాపాడుకొనేందుకు నాన్నతో కలిసి తన వంతు ప్రయత్నం మొదలుపెట్టింది. పడవలో కూర్చొని వలతో నీటిలోని వ్యర్థాలను బయటకు తీసిన ఆ చిన్నారి... తరువాత కూడా ఆ కార్యక్రమాన్ని కొనసాగించింది. తోటి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపింది. అలనాటి చిత్రాన్ని ఇటీవల తన ఇన్‌స్టాలో పోస్టు చేసింది జన్నత్. జతగా ఇప్పటి ఫొటో కూడా పంచుకుంది.



## నేడూ అదే చైతన్యం...

పదేళ్లు గడిచిపోయాయి... జన్నత్ జీవితంలో. కానీ ఆమె సంకల్పం చెక్కు చెరదలేదు. పర్యావరణ పరిరక్షణ కోసం జన్నత్ చేస్తున్న కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ప్రధాని మోదీ నుంచి గౌరవ పురస్కారం సైతం అందుకుంది. అయినా ఇసుమంతైనా గర్వం లేదు ఆమెలో. నేటికీ అదే అంకితభావం... ఉత్సాహం. ఎక్కడ ఉన్నా... ప్రతి ఆదివారం మాత్రం దాల్ లేక్ ముందు వాలిపోతుంది. చేతిలో ఒక వల పట్టుకొని... చిన్న పడవ ఎక్కి... అందులోని వ్యర్థాలను తొలగించే పనిలో నిమగ్నమైపోతుంది. ప్రజల్లో చైతన్యం రగిలించి... వారిని కూడా ఆ దిశగా అడుగులు వేయిస్తుంది. అవగాహన సదస్సులు నిర్వహించి... సామాన్యులతో పాటు ప్రభుత్వ యంత్రాంగాన్నీ కదిలించి... దాల్‌లేక్ పరిరక్షణను ఒక ఉద్యమంలా ముందుకు నడిపిస్తోంది.

'మాతృభూమిని ప్రేమించండి. మాటలతో కాదు... మీ చేతలతో' అంటూ నాడు తండ్రి నింపిన స్ఫూర్తే నేటికీ జన్నత్‌ను ఇంధనమై నడిపిస్తోంది.

## చరణ్య.. సంస్కృతి పరిచయం

పదేళ్ల కిందటి తన ఫొటోను... తాజా చిత్రంతో కలిపి ఇన్‌స్టాలో పెట్టింది చరణ్యా కుమార్. ఈ దశాబ్ద కాలంలో ఆమె జీవితంలో పెద్ద మార్పులేమీ జరగలేదు. కానీ తన చుట్టూ ఉన్నవారిలో మార్పు తేవడంలో సఫలమయ్యారు. అమూల్యమైన భారతీయ సంస్కృతిని భావితరాలకు అందించే బృహత్తర కార్యక్రమానికి నాడు శ్రీకారం చుట్టిన ఆమె... నేడు దాన్ని ఒక వ్యవస్థగా మార్చారు. 'చిత్తమ్' పేరుతో పర్యావరణహిత విద్యా, వినోద స్టార్టప్‌ను తీసుకువచ్చారు. పిల్లలు, పెద్దలు కలిసి ఆడే పదిహేడు రకాల బోర్డ్, కార్డ్ గేమ్స్, యాక్టివిటీ కిట్స్‌ను సంస్థ పరిచయం చేసింది. వీటన్నిటినీ సాంస్కృతిక, ఆధ్యాత్మిక విద్యను సరదాగా, అదే సమయంలో అర్థవంతంగా బోధించే సాధనాలుగా రూపొందించింది. అంతేకాదు... పాఠశాలలకు వెళ్లి అక్కడి పిల్లలతో ఆటలు ఆడిస్తూ, అవగాహన కల్పిస్తున్నారు చరణ్య. ఇందుకుగానూ ఆమె పలు పురస్కారాలు, ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు.

## భావితరాలకు అందించాలని...

బాల్యం నుంచి భారతీయ సంస్కృతి, చరిత్ర పట్ల ఆసక్తి కనబరిచిన చరణ్య... తోటి పిల్లలకు వాటిని కథలుగా చెప్పింది. అమెరికాలోని నార్త్ కరోలినా యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో ఎంఎస్ చేసిన ఆమె... 2014లో 'ఇన్‌సీడ్' బిజినెస్ స్కూల్‌లో ఎంబీయే చదివింది. భారత్‌కు తిరిగి వచ్చాక బెంగళూరులోని వివిధ సంస్థల్లో ఉద్యోగం చేసింది 2021లో 'గురుకూల్ ఫన్' స్టార్టప్‌ను నెలకొల్పింది. తరువాత ఆ సంస్థ నుంచి బయటకు వచ్చి మూడున్నరేళ్ల కిందట స్వస్థలం చెన్నైలో 'చిత్తమ్'ను ప్రారంభించింది. ఇప్పుడు ప్రముఖ సంస్థలతో కలిసి తన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకొంటున్న చరణ్య లక్ష్యం... డబ్బు సంపాదన ఒక్కటే కాదు. భారతీయ మూలాలను భావితరాలకు అందించాలన్న బలమైన ఆకాంక్ష కూడా.




# ఖండాంతరాల్లో ఆమె స్ఫూర్తి

**ఆమె పుట్టింది పల్లెటూరిలో.. ఆరుగురు ఆడపిల్లల కుటుంబంలో కట్టుబాట్లు, ఆర్థిక పరిమితులు.. అయినా 'నేను చేయగలను' అనే ఆత్మవిశ్వాసం ఆమె ఆయుధం. న్యూజిలాండ్, అమెరికా.. ఆ తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై అడుగుపెట్టి, ఐటీ రంగంలో ఎగ్జిక్యూటివ్ లీడర్‌గా ఎదిగి, అక్కడి రాజకీయాల్లోనూ తెలుగు గళాన్ని వినిపించిన హైమారెడ్డి ఉల్పాల ప్రస్థానం ఇది. "తెలంగాణలోని నారాయణపేట జిల్లా నిడుగుర్తి నేను పుట్టిన ఊరు.**

**మా నాన్న నర్సిరెడ్డి డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేసేవారు. ఉద్యోగ రీత్యా ఆయన నిరంతరం బదిలీలపై వెళ్తుంటే.. మా అమ్మ రుక్మిణి ఒకవైపు వ్యవసాయాన్ని చూసుకుంటూనే ఆరుగురు పిల్లలను క్రమశిక్షణతో పెంచారు. చదువుకోకపోయినా అమ్మలో అసాధారణమైన నాయకత్వ లక్షణాలు ఉండేవి. వ్యవసాయాన్ని మేనేజ్ చేయడం, కూలీలను చూసుకోవడం, ఊరిలో ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలబడటాన్ని చూస్తూ పెరిగాను. ఆ ధైర్యం, ఆ నాయకత్వ లక్షణాలు తెలియకుండానే నాకు ఒంటబట్టాయి. అందుకే ఎన్ని అడ్డంకులు ఎదురైనా తలవంచడం ఎరుగను.**

### నెరవేరని డాక్టర్ కల

ఆడపిల్లల చదువుల కంటే పెళ్లిళ్లకే అత్యంత ప్రాధాన్యం ఇచ్చే రోజులు అవి. ఆరుగురు అమ్మాయిలకు కట్నాలు ఇచ్చి పెళ్లిళ్లు చేయడం నాన్నకు భారమని చుట్టుపక్కల వారు అంటున్నా, చదువుపై నాకున్న ఇష్టాన్ని నా తల్లిదండ్రులు ఏనాడూ కాదనలేదు. నిజానికి నేను డాక్టర్ కావాలని ఎన్నో కలలు కన్నాను. కానీ, ర్యాంకింగ్ సమీకరణల వల్ల ఆ కల నెరవేరలేదు. అయినా నిరాశ చెందకుండా పోలీస్ ఫోర్స్‌లో చేరాలని శ్రమించాను. కానీ, అక్కడ కూడా అదృష్టం కలిసి రాలేదు. అయితే, డిగ్రీ చేస్తున్న సమయంలో హాబీగా నేర్చుకున్న కంప్యూటర్ ప్రోగ్రామింగ్ నా జీవితాన్ని ఇంతటి ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని అప్పుడు ఊహించలేదు.

### న్యూజిలాండ్‌లో తొలి అడుగులు

నాగర్‌కర్నూల్‌కు చెందిన రాజవర్ధన్‌రెడ్డితో వివాహం జరిగాక సరికొత్త ఆశలతో న్యూజిలాండ్ చేరుకున్నాను. కొత్త దేశం, అర్థం కాని ఇంగ్లిష్.. ఉద్యోగాలు దొరకని పరిస్థితి.. అన్నీ సవాళ్లే, అయినా వెనక్కి తగ్గలేదు. మొదట్లో ఒక ఇండియన్ రెస్టారెంట్‌లో అతి తక్కువ జీతానికి పనిచేశాను. ఆ తర్వాత మెక్‌డొనాల్డ్స్‌లో అవకాశం వచ్చింది. అక్కడ పనిచేస్తూనే కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాను. పగలు పనిచేస్తూ, రాత్రిళ్లు ఐటీ నైపుణ్యాలకు పదును పెట్టుకుంటూ నా కెరీర్‌కు గట్టి పునాదులు వేసుకున్నాను. అపై అమెరికా వెళ్లి మరింత అనుభవాన్ని గడించి మళ్లీ న్యూజిలాండ్ చేరుకున్నాను. ఆ అనుభవమే నన్ను ఒక పటిష్టమైన వృత్తి నిపుణురాలిగా తీర్చిదిద్దింది.

### ఆస్ట్రేలియాలో తెలుగు జెండా

2000వ సంవత్సరంలో న్యూజిలాండ్ నుంచి ఆస్ట్రేలియా చేరుకున్నాను. మెల్‌బోర్న్‌లో స్థిరపడ్డాను. అక్కడ అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించాను. ప్రస్తుతం ఆస్ట్రేలియన్ రీసెర్చ్ డేటా కామన్స్ (ఏఆర్‌డీసీ)లో ఎగ్జిక్యూటివ్ లీడర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ, అక్కడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో నా ముద్ర వేశాను. నా జీవితంలో అత్యంత గర్వపడే ఘట్టం.. ఆస్ట్రేలియా స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడం. ఈ ఎన్నికల బరిలో నిలిచిన తొలి భారతీయ, తెలుగు మహిళగా చరిత్ర సృష్టించాను. 2016 కౌన్సిల్ ఎన్నికల్లో స్థానిక అభ్యర్థులకు నేను గట్టి పోటీ ఇచ్చాను. గెలవకున్నా ఆ ఎన్నికలు నాకు ఒక మరుపురాని జ్ఞాపకంగా మిగిలిపోయాయి.

### ఉత్సవంలా సంక్రాంతి పండుగ

ఎక్కడ ఉన్నా, పదవులు ఉన్నా, లేకున్నా మన మూలాలు మరచిపోకూడదన్నది నా సిద్ధాంతం. అందుకే ఆస్ట్రేలియాలోని తెలుగు పిల్లలు మాతృభాషకు దూరం కాకూడదని పదేళ్లపాటు స్వచ్ఛందంగా తెలుగు స్కూల్ నడిపాను. సంకాంత్రి పండుగను ఆస్ట్రేలియా గడ్డపై ఒక ఉత్సవంలా మార్చి వేలాదిమంది భారతీయులను ఏకం చేశాను. ముగ్గుల పోటీలు, గాలిపటాల పండుగతో ఆస్ట్రేలియా వీధుల్లో తెలుగుదనాన్ని నింపాను. నా ఈ కృషిని గుర్తించి 'అమెరికన్ తెలుగు అసోసియేషన్' వారు 'ప్రవాస భారతీయ అవార్డు'తో నన్ను గౌరవించడం నా బాధ్యతను మరింత పెంచింది.

### విద్యార్థులకు దిక్సూచి

నా ప్రస్థానంలో నాకు అత్యంత సంతృప్తినిచ్చే విషయం.. మన దేశం నుంచి వచ్చే విద్యార్థులకు దిశానిర్దేశం చేయడం. భారత్ నుంచి, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిమంది విద్యార్థులు ఎన్నో కలలతో ఆస్ట్రేలియా వస్తుంటారు. ఇక్కడకు వచ్చాక వాస్తవ పరిస్థితులు తెలిసి దిక్కుతోచని స్థితిలో పడిపోతుంటారు. అలాంటి వారికి ఒక భరోసాలా నిలబడాలని నేను సంకల్పించాను. స్థానిక కాలేజీలు, యూనివర్సిటీలతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థి ఆసక్తిని బట్టి ఏ కోర్సు చదివితే బాగుంటుంది? ఏ యూనివర్సిటీలో ఫీజులు తక్కువ, అవకాశాలు ఎక్కువ.. అన్న విషయాలపై పూర్తి అవగాహన కలిస్తున్నాను. ఏ ప్రతిఫలం ఆశించకుండా నేను చేస్తున్న ఈ సేవ విద్యార్థుల కెరీర్ గ్రోత్‌కు తోడ్పడుతోంది. వేల మైళ్ల దూరంలో ఉన్న తమ బిడ్డలు హైమారెడ్డి పర్యవేక్షణలో సురక్షితంగా ఉన్నారన్న భరోసా భారత్‌లోని వారి తల్లిదండ్రులకు కొండంత అండ. విద్యార్థి దశ నుంచి వారిని గ్లోబల్ ప్రొఫెషనల్స్‌గా మార్చే ఈ ప్రయాణంలో నేను పొందే ఆనందం వెలకట్ట లేనిది. నా సేవాభావం గురించి తెలుసుకున్న భారత్‌లోని ప్రతిష్ఠాత్మక యూని వర్సిటీలు, కాలేజీలు నాతో కలిసి పనిచేసేందుకు ముందుకు వస్తున్నాయి. వారి విద్యార్థులకు దిశానిర్దేశం కోసం నన్ను సంప్రదిస్తున్నాయి.

### కుటుంబమే నా బలం

ఈ సుదీర్ఘ ప్రయాణంలో నా భర్త రాజవర్ధన్‌రెడ్డి, పిల్లల సహకారం ఎంత ఉందో.. నా తోడబుట్టిన సోదరీమణుల తోడ్పాటు కూడా అంతే ఉంది. మేం ఆరుగురం ఆడపిల్లలం. నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి నా అక్కచెల్లెళ్ల నిరంతర ప్రోత్సాహం, వారి వెన్నుదన్ను కూడా ఒక ముఖ్య కారణం. నా జీవితంలో ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా, ప్రతి సందర్భంలోనూ నా వెన్నంటి ఉంటూ 'నీ వల్ల అవుతుంది.. నువ్వు సాధించగలవు' అంటూ నాకు కొండంత ధైర్యాన్ని ఇచ్చారు. వారి ప్రేమాభిమానాలు నాకు ఒక రక్షణ కవచంలా నిలిచాయి. విక్టోరియాలోని 'తెలంగాణ అసోసియేషన్'కు ఫౌండింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించిన నా భర్త రాజవర్ధన్‌రెడ్డి నా ప్రతి ఆశయానికి అండగా నిలిచారు. ఉద్యోగం, సామాజిక సేవ, రాజకీయాలు.. ఇలా ఎన్ని బాధ్యతలు నిర్వరిస్తున్నా ఇంటి బాధ్యతలు పంచుకుంటూ నన్ను ముందుకు నడిపిస్తున్న కుటుంబమే నా అసలైన ఆస్తి".

---

**మహిళలకు సర్వసాధారణమైన రుతుక్రమం వారిని చదువుకు, ఉపాధికి దూరం చేస్తోందనే వాస్తవం సురభి కుమార్‌ను కొత్తదారిలో నడిపించింది. బిహార్ గ్రామీణ ప్రాంతాల్లో ఆమె సాగిస్తున్న కృషి ముప్పై వేలమందికి పైగా మహిళలు, బాలికల్లో అవగాహనను, ఆత్మవిశ్వాసాన్ని నింపింది. "శరీరంలో సంభవించే మార్పులు, వాటికి కారణాల గురించి బోధన... అక్షరాస్యతలో ప్రధానమైన భాగం కావాలి" అంటున్న సురభి ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...**

**"మహిళా సాధికారతలో మన దేశం సాధిస్తున్న పురోగతి గురించి గొప్పగా చెప్పుకుంటాం. కానీ అర్థంలేని నమ్మకాలు, కట్టుబాట్లు, ఆంక్షల మధ్య నలిగిపోతున్న మహిళలు మన దేశంలో ఇప్పటికీ కోట్ల సంఖ్యలో ఉన్నారు. నేను కూడా అలాంటి నేపథ్యం నుంచే వచ్చాను. మాది బిహార్ రాష్ట్రంలోని గయ. అమ్మాయిలు హద్దుల్లో ఉండాలి. చీకటి పడ్డాక బయటకు వెళ్లకూడదు. అన్ని విషయాల్లోనూ సర్దుకుపోవాలి.. బడికి వెళ్లే వయసు వచ్చేసరికి ఇవన్నీ జీవితంలో భాగమై పోతాయి. అలాగే... నెలసరి అనేది రహస్యంగా ఉంచాల్సిన విషయం. దాని గురించి ఎవరితోనూ మాట్లాడకూడదు' అనేది కచ్చితంగా పాటించాల్సిన నియమం. వీటన్నిటినీ దాటి... సాటి మహిళల్లో చైతన్యం కలిగించే దశకు చేరుకోవడానికి ఎంతో దూరం ప్రయాణం సాగించాను.**



# అపోహలు తొలగించి సాధికారత వైపు

మొదటి పేజీ తరువాయి

### రెండుసార్లు ఇంటర్ తప్పాను

నన్ను డాక్టర్‌నో, ఇంజనీర్‌నో చేయాలనేది నా తల్లిదండ్రుల కల. పోటీ పరీక్షలకు మంచి శిక్షణ లభిస్తుందనే ఉద్దేశంతో రాజస్థాన్‌లోని కోటాలో ఇంటర్‌లో నన్ను చేర్పించారు. ఒత్తిడి కారణంగా రెండుసార్లు ఇంటర్ ఫెయిలైపోయాను. ఇంటర్ పూర్తి చేశాక పట్నాలో జర్నలిజం కోర్సు చేశాను. అందులో భాగంగా... 'అబ్దుల్ లతీఫ్ జమీల్ పావర్టీ యాక్షన్ ల్యాబ్'తో కలిసి ఒక ప్రాజెక్ట్ చేశాను. కొన్ని సంస్థల్లో పాత్రికేయురాలిగా పనిచేశాను. అప్పుడే 'సమర్థ్' అనే స్వచ్ఛంద సంస్థను నడుపుతున్న ప్రభాత్‌తో పరిచయమయింది. బిహార్‌లోని చిన్నకారు, సన్నకారు రైతుల కోసం ఆ సంస్థ పని చేస్తోంది. ప్రభాత్ ఆశయాలు నన్ను ఆకర్షించాయి. మేము వివాహం చేసుకున్నాం. ఉద్యోగం మానేసి నా భర్త సంస్థకే పూర్తి సమయం కేటాయించాను.

### అపోహలు తొలగేలా...

'సమర్థ్' తరఫున విస్తృతంగా పర్యటించినప్పుడు... మన గ్రామీణ ప్రాంతాల్లోని దుర్భర వాస్తవాలు నాకు మరింత స్పష్టంగా అర్థమయ్యాయి. నెలసరి సమయంలో ఒకే పాత వస్త్రాన్ని సరిగ్గా ఉతక్కుండా, ఆరబెట్టకుండా ఉపయోగించే మహిళలను కలుసుకున్నాను. కూలి పనికి, పంట కోతలకు వెళ్లే మహిళలు పీరియడ్స్ కాలంలో ఇల్లు దాటి బయటకు రారు. అలాగే... నెలసరి సాకు చెబుతారంటూ కొందరు వారిని పనిలో పెట్టుకోరు. తమ శరీరంలో వచ్చే ఈ మార్పుకు కారణాలేమిటో చాలామంది మహిళలకు తెలీదు. దీన్ని ఒక పాపంగానో, నేరంగానో భరిస్తూ... అపరాధ భావంతో బతుకుతున్న మహిళలు, బాలికల దుస్థితిని చూశాక నేను ఏం చేయాలో అర్థమయింది. 'సమర్థ్'కు అనుబంధంగా 'సబల' అనే విభాగాన్ని ఏర్పాటు చేశాను. నేను, మరికొందరు వాలంటీర్లు కొన్ని వందల గ్రామాలు సందర్శించాం. పొలాల్లో, సామాజిక కేంద్రాల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో మహిళలను కలిశాం. వారి సమస్యలు తెలుసుకున్నాం. రుతుక్రమం పట్ల వారికి ఉన్న అపోహలను తొలగించడం కోసం... (పీరియడ్‌శాల' పేరిట సమావేశాలు నిర్వహించాం. నెలసరి సమయంలో పాటించాల్సిన శుభ్రత, సంరక్షణ గురించి వివరించాం. స్కూళ్లలో బాలికలకు పీరియడ్స్ మీద అవగాహన కల్పించాం.

### అదే నా ఆశయం...

గ్రామీణ మహిళలకు శానిటరీ ప్యాడ్స్ అందుబాటు తక్కువ. వాటికి అయ్యే ఖర్చు భరించే సామర్థ్యం కూడా ఉండదు. అందుకే నా కుటుంబ సభ్యులు, మిత్రుల సహకారంతో పూర్తి ఆటోమేటిక్ శానిటరీ ప్యాడ్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేశాను. ఆరు ప్యాడ్స్ తయారీకి 42 రూపాయలు ఖర్చవుతుంది. వాటిని పాతిక రూపాయలకే ఇస్తున్నాం. అది కూడా చెల్లించలేనివారికి ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. ఇప్పటివరకూ మా కార్యక్రమాల ద్వారా పాతికవేల మందికి పైగా మహిళలు, దాదాపు అయిదువేల మంది బాలికలు ప్రయోజనం పొందారు. వారిలో ఆత్మ విశ్వాసం పెరిగింది. నెలసరి గురించి మాట్లాడడం తప్పు కాదని అర్థమయింది. అదే మేము ఆశించిన మార్పు. మా కృషికి అధికారుల నుంచి, ప్రభుత్వం నుంచి ప్రశంసలు లభించాయి. ప్రతినెలా కొన్ని కొత్త గ్రామాలకు మా కార్యక్రమాలను విస్తరిస్తున్నాం. 'సబల' అంటే 'సాధికారత కలిగిన మహిళ' అని అర్థం. అందరు మహిళలను సబలలుగా మార్చాలనేదే నా ఆశయం.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జూన్ 4, 5 తేదీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చేపట్టనున్న పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి జడ్చర్లలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం ఓఎస్డీ కమలాసన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జడ్చర్ల ఏరియా ఆసుపత్రి సమీపంలోని ఖాళీ స్థలంలో ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. సభా ప్రాంగణంలో పరిశుభ్రత, వేదిక నిర్మాణం, టెంట్లు, త్రాగునీటి సౌకర్యం, సీటింగ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, వీఐపీ గ్యాలరీలు, పోలీసు బందోబస్తు, బ్యారికేడ్ల ఏర్పాట్లు తదితర అంశాలను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సభకు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రజల రాకపోకల నిర్వహణపై





ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఇక ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకితో కలిసి ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్ల నిర్మాణం, వ్యూ పాయింట్ వద్ద భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్, త్రాగునీటి సౌకర్యం, గ్రీన్ రూములు, మరుగుదొడ్లు తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే కరివెన రిజర్వాయర్ వద్ద కూడా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డితో కలిసి సమీక్షించారు. హెలిప్యాడ్ల నిర్మాణం, వ్యూ పాయింట్ ఏర్పాట్లు, భద్రతా చర్యలు, వీఐపీలు, మీడియా ప్రతినిధుల కోసం భోజన వసతులు, సమీక్ష సమావేశాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను అన్ని శాఖల సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి ఆటంకాలు లేకుండా పోలీసు, రెవెన్యూ, ఆర్ అండ్ బి, అగ్నిమాపక, అటవీ, వైద్య ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## సీబీఎస్ఈ వివాదం..రంగంలోకి కేంద్రం

న్యూఢిల్లీ : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ రీవేల్యూషన్ ప్రక్రియలో లోపాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. బోర్డు ఛైర్మన్ రాహుల్ సింగ్, కార్యదర్శి హిమాంశు గుప్తాలనుబదిలీ చేసింది. వారి స్థానంలో కొత్త ఛైర్మన్‌గా లోఖండే ప్రశాంత్ సీతారామ్, కార్యదర్శిగా వరుణ్ భరద్వాజ్‌ను నియమించింది. అంతే కాదు, ఈ వివాదంపై విచారణకు కమిటీని నియమించింది. ఛైర్మన్ హోదాలో సీబీఎస్ఈ బోర్డు మొత్తం పని తీరు, పరిపాలన బాధ్యతలను రాహుల్ సింగ్ నిర్వర్తిస్తుండగా.. బోర్డుకు సంబంధించిన చట్టపరమైన అంశాలు, ఆడిట్, ప్రజా సంబంధాలు వంటి విభాగాలను హిమాంశు చూసుకుంటున్నారు.ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానం అమలు, విద్యార్థులు నుంచి వచ్చిన సమస్యలపై విచారణ జరిపేందుకు ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. సామర్థ్య నిర్మాణ కమిషన్ ఛైర్‌పర్సన్ ఎస్. రాధా చౌహాన్ ఈ ఏకసభ్య కమిటీకి అధ్యక్షత వహిస్తారు. ఈ కమిటీ తన నివేదికను నెలలోగా సిబ్బంది వ్యవహారాలు- శిక్షణ విభాగానికి సమర్పిస్తుంది. మరోవైపు, ఓఎస్ఎం అమలు, విద్యార్థులు నివేదించిన సమస్యలపై కమిటీ సభ్యులకు వివరించడానికి స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రెటరీ సంజయ్ కుమార్‌తో పాటు రాహుల్ సింగ్‌కు పార్లమెంటరీ ప్యానెల్ సమన్లు జారీ చేసింది.జవాబు పత్రాలు తారుమారు కావడం, మూల్యాంకనంలో తప్పులు, తప్పుడు దిశానిర్దేశం, తప్పుడు గ్రేడ్‌ల కేటాయింపు వంటి అనేక సమస్యలు ఉన్నాయి. స్కాన్ చేసిన కాపీల తమవి కావని కనుగొన్నారు. మూల్యాంకన ప్రక్రియలో సుమారు 20 జవాబు పత్రాల పొంతన లేనివిగా గుర్తించినట్లు సీబీఎస్ఈ అధికారులు అంగీకరించారు. వేరే ఎవరో రాసిన పేపర్లు తనదాంటో కలిపేశారని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అయ్యింది.

## బాలీవుడ్ డైరక్టర్స్ ను దాటేస్తున్న టాలీవుడ్ డైరక్టర్స్...

హైదరాబాద్ : బాహుబలి సినిమా ఎప్పుడైతే వచ్చిందో అప్పటినుంచి తెలుగు సినిమాల హవా ఇండియా వైడ్ గా కొనసాగుతుంది. ఇప్పటికే మన దర్శకులు భారీ పాపులారిటిని సంపాదించుకున్నారు. ఒకప్పుడు ఇండియాలో స్టార్ డైరెక్టర్లు ఎవరు అంటే బాలీవుడ్ దర్శకుల పేర్లు చెప్పారు. కానీ ఆయా దర్శకులకు ఒక్కొక్కరికి మన ఒక్కొక్క దర్శకుడు చెక్ పెడుతూ వచ్చాడు. ముఖ్యంగా రాజ్ కుమార్ హిరానీ లాంటి స్టార్ డైరెక్టర్ కి వరుస సక్సెస్ లను సాధిస్తూ తనకెదురుగా ఎవరు లేరు అనేంతలా పేరును సంపాదించుకున్నాడు. కానీ అతనికి రాజమౌళి బాహుబలి సినిమాతో చెక్ పెట్టాడు. ఇక బాహుబలి 2 సినిమాతో బాలీవుడ్ దర్శకులందరిని ఒకేసారి పక్కన పెట్టేసిన రాజమౌళి ఇండియాలో నెంబర్ వన్ డైరెక్టర్ గా మారాడు?కమర్షియల్ సినిమాలతో సక్సెస్ ను సాధించే రోహిత్ శెట్టికి సుకుమార్ చెక్ పెట్టాడు. 'పుష్ప 2' సినిమాతో 1850 కోట్లకు పైన కలెక్షన్స్ ను రాబట్టి తెలుగు దర్శకులు కమర్షియల్ సినిమాలు చేస్తే ఎలా ఉంటుందో వాళ్లందరికి చూపించాడు?ఇక బాలీవుడ్ హీరో తోనే అనిమల్ సినిమా చేసి ఇండస్ట్రీ రికార్డులను బ్రేక్ చేసిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా?ఆయన సైతం బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అయిన సంజయ్ లీలా భన్సాలీ కి చెక్ పెట్టాడు? ఇక నాగ్ అశ్విన్ లాంటి దర్శకుడు సైతం ఇండస్ట్రీలో ఉన్న మిగతా దర్శకులందరికి చెక్ పెట్టాడు. ఇలా మన దర్శకుల హవా కొనసాగడమే కాకుండా బాలీవుడ్ దర్శకులను సైతం డామినేట్ చేస్తూ మనవాళ్ళు ముందుకు దూసుకెళ్లడం అనేది నిజంగా ప్రతి ఒక్కరిని ఆనందానికి గురిచేస్తుంది.ఇక అలాంటి దర్శకులు తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి మరింత మంది రావాలని బాలీవుడ్ ఇండస్ట్రీ షేక్ అయ్యేలా మనవాళ్లు సినిమా చేయాలని బాలీవుడ్ హీరోలు సైతం మనవాళ్ళతో సినిమాలు చేయడానికి ఇంట్రెస్ట్ చూపించాలని ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారు.







OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085